# క్షణికం!

## [పెద్ద కథ]

రాత్రి పదకొండు అయింది. రాజ్యలక్ష్మి ఒక చిన్న కునుకు తీసి కళ్ళు తెరిచింది. భర్త రమణరావు కిరసనాయిలు లాంతరు చిమ్నీ పైకెత్తి చీపురుపుల్లతో బెడ్లయిట్ వెలిగిస్తున్నాడు. ఒక్కసారి ఆవిలించి లేచి, మంచానికి మధ్యగా కూచుంది రాజ్యలక్ష్మి. బెడ్లయిట్ వెలిగించాక, రమణరావు పుస్తకాలన్నిటిని దొంతరలా పేర్చి, టేబుల్ కి ఒకపక్కగా తోసి వెనక్కి తిరిగి "ఓ నిద్దరయినట్టుందే" అన్నాడు.

రాజ్యలక్ష్మి సిగ్గుపడి సన్నగా నవ్వింది.

"మంచి నీళ్లెక్కడ పెట్టావ్?" అన్నాడు రమణరావు.

రాజ్యలక్ష్మి లేచి చీరె సవరించుకుని, మంచం కిందగా పెట్టిన మరచెంబులో నీళ్ళు గ్లాసులో పోసిచ్చింది.

"అలా ఆ తలుపుతీసి గుమ్మంలో నిల్చుంటారా?" అని భర్తను సిగ్గుపడుతూ అడిగింది.

ఆ గదికి రెండు ద్వారాలున్నాయి. ఒక ద్వారం సావిట్లోకి, మరో ద్వారం దొడ్లోకి ఉంది. ఇంటికి చుట్టూ ఎత్తయిన ప్రహారీగోడ ఉంది. రమణరావు తలుపు దగ్గిరగా నిల్చున్నాడు. రాజ్యలక్ష్మి పెరట్లోకి వెళ్ళింది.

దబుక్కున ఏదో పడినట్లు అయిన శబ్దంతో రమణరావు తలెత్తి చూశాడు. ఆ చీకటిలో ఏదో నీడ అతనికి లీలగా కనపడ్డింది. రెండడుగులు ముందుకు వేసి, వసారాలోకి వచ్చి తొంగి చూశాడు. ప్రహరీగోడ నీడలో ఏదో తెల్లగా మెదుల్తున్నట్టు తోచి "ఎవరది?" అని గట్టిగా పిలిచాడు రమణరావు!

"ఏవిటండీ, ఎవరు?" అంటూ భయంగా పరుగెత్తుకొచ్చింది రాజ్యలక్ష్మి. "నువ్వింట్లోకి పో" అంటూ రమణరావు వసారాలోంచి దొడ్లోకి పరుగెత్తాడు. ఈ కేకతో యింట్లో అంతా లేచారు. మామగారు తలుపు కొట్టడంతో రాజ్యలక్ష్మి గదితలుపు తీసింది. భర్త వెనగ్గా మామగారు పరుగెట్టారు. అత్తగారు దీపం వెలిగించి, సావిటి తలుపు తీసుకు, వీధివాకిలివైపు పరుగెత్తింది. ఆడపడుచు గడగడ వణుకుతోంది.

అట్లానే దొడ్డి గుమ్మంలో నుల్చుంది రాజ్యలక్ష్మి. మామగారూ భర్త ఏదో మాట్లాడుకుంటూ వెతుకుతున్నారు.

"ఎవరూ లేరురా? - నీ భ్రమగాని!" అంటున్నారు మామగారు.

"అబ్బే లేదు నాన్నా, నే చూస్తేనే. తెల్లబట్టలమనిషి స్పష్టంగా అవుపించాడు! పైగా గోడమీంచి దూకుతుంటే శబ్దంకూడా అయింది" అన్నాడు రమణరావు.

"అయితే ఎక్కడరా?"

"అలా వీధివైపుకు వెళ్ళేడేమో! మన కాంపౌండు లోనే ఉండాలి. వీధి తలుపుమూసి, తలుపుదగ్గిర అమ్మతో పాటు నువ్వు నుల్చో. నే నీ పక్కంతా చూసుకుంటూ వీధి వైపుకు వస్తా" అంటూ తండ్రిని వీధి వాకిలివైపుకు పంపి, టార్చిలైటుతో దొడ్డిచుట్టూ వెతుకుతున్నాడు రమణరావు.

రాజ్యలక్ష్మి గుండె దడదడ కొట్టుకుంటోంది. తను దొంగల కథలు వింటమేగాని, ఎప్పుడూ దొంగని కంటితో చూడలేదు. తానావాటికి బయటికిగనక రాకపోతే, వాడు మెల్లగా ఏ వంటిల్లో దోచుకుపోను. తానురాబట్టి భర్త దొంగని చూడగలిగాడు.

వీధివాకిలి వైపునుంచి మామగారి వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయి. రాజ్యలక్ష్మికి తానొక్కతే చీకట్లో నుంచు న్నట్లు జ్ఞాపకంవచ్చి భయంవేసింది. ఒక్క పరుగున గదిలోకి వెళ్ళి మంచంమీద కూచుంది. ఎందుకో వూరికే భయంగా వుంది రాజ్యలక్ష్మికి.

తెరిచిన దొడ్డివేపు తలుపులోంచి ఎవ్వరో రివ్వున గదిలోనికి దూసుకొచ్చారు. కేక వెయ్యబోయే రాజ్యలక్ష్మి నోటిని గట్టిగా మూశాడు. "అరవకు. నిన్నేం చెయ్యను. వాళ్ళు ఆ వీధివైపు నుంచి వెళ్ళాక పారిపోతా" అంటూ హాలుకీ గదికీ మధ్య తలుపు మూశాడు.

రాజ్యలక్ష్మికి ప్రాణాలు పైన పోయాయి. నోటమ్మట మాట రావడంలేదు. అలా మంచంమీద కూచుండిపోయింది. రమణరావూ, మామగారూ వస్తున్న అడుగులచప్పుడైంది.

దొంగ గభాలున దొడ్డి తలుపుగూడా మూశాడు. రాజ్యలక్ష్మికి యిప్పటికి అసలు స్థితి అర్థంఅయింది.

హాల్లు తలుపు తీద్దామని మంచంమీంచి లేవబోతూంటే బుజాలు పట్టుకుని కదలనివ్వకుండా చేశాడా మనిషి.

"ఎవరు నువ్వు – వదులు" అంటోంది రాజ్యలక్ష్మి. తన మాటలు తన చెవులకి నూతిలోంచి మాదిరి విచిత్రంగా వినిపించాయి.

"ఇదుగో జాగ్రత్తగా విను. అరిచావా నీకూ నాకూ ఇద్దరికీ నష్టం. వాళ్ళు దొడ్డంతా వెతికి ఎవరూలేరని హాల్లోకి వస్తారు. అప్పుడు మెల్లిగా నే దొడ్డివైపునుంచి వెళ్ళిపోతా. అనవసరంగా అరవకు. అరుస్తే నీకే ముప్పు."

"కత్తితో పొడుస్తావా?" అంది రాజ్యలక్ష్మి భయంతో.

"పొడవనూ చంపనూ ఏమీ చెయ్యను. ఇప్పుడు అరిచావా నా కంటే నీకే నష్టం" అంటున్నాడా కొత్త మనిషి.

రమణరావు దొడ్డంతా వెదికి, లాంతరుతో సహా గది దొడ్డిగుమ్మం వేపు వచ్చాడు. అత్తగారు మామగారు సావిట్లోకి వెళ్ళినట్లు మాటలు వినిపిస్తున్నాయి. రాజ్యలక్ష్మి కాళ్లూ చేతులూ మంచు కొండల్లా అయిపోతున్నాయి.

"రాజ్యం, తలుపు తియ్యి" అంటున్నాడు భర్త.

"రాజ్యలక్ష్మికి కాళ్ళు ఆడటంలేదు" అంతదాకా గది గోడనానుకుని నుంచున్న ఆ మనిషి కాస్తా రాజ్యలక్ష్మి కాళ్ళ

మీద అమాంతంపడి, "తలుపు తియ్యకు, తీస్తే నన్ను కొడ తారు, తియ్యకు" అంటూ ప్రాధేయపడుతున్నాడు. రాజ్య లక్ష్మికేమీ అర్థం కావడంలేదు.

"ఏయ్-తలుపు తియ్యి" అంటున్నాడు భర్త.

లోపల మరొక కంఠం వినపడటంతో రమణరావుకి మతి పోయినట్లయింది.

"తలుపు తీస్తావా, తియ్యవా?" అని ఒక గట్టి కేక పెట్టాడు.

ఆ కేక హాలులోవున్న అత్తా మామలకీ; ఆడబిడ్డకీ వినపడింది.

అటు హాల్లోంచి వాళ్ళు తలుపు తియ్యమని పిలుస్తు న్నారు. ఇటు రమణరావు దొడ్డి తలుపుమీద పిడికిళ్ళతో బాదుతున్నాడు. గదిలో ముక్కూ ముఖం ఎరగని మొగ వాడు కాళ్లు రెండూ పట్టుకు వదలడంలేదు. రాజ్యలక్ష్మికి అంతా అయోమయంగా వుంది.

అటు హాల్లోనుంచి తలుపుని బాదుతున్నారు అత్త గారు. ఇటు భర్త వాళ్ళు తెలియని ఆవేశంతో తలుపుని బలంకొద్దీ తంతున్నాడు.

"లాభంలేదు. పట్టుబడిపోయాను" అంటూ లేచాడు పాదాలు వదలి ఆ మనిషి. రాజ్యలక్ష్మికి అతని మాటలు వినపడటంలేదు. తలుపులు బాదడం మట్టుకే వినిపిస్తోంది.

అతను లేచి "లాభంలేదు తలుపు తియ్యి నన్నింక వదలరు" అన్నాడు.

ఆమె అర్థంకానట్లు అతనివంక తేరిపార చూస్తోంది. ఆమె నిల్చున్న చోటునుంచి కదలకపోవడం, యిటు తలుపు మీద దెబ్బలు ఆగకపోవడం చూసి అతనే నెమ్మదిగా వెళ్ళి రమణరావు నుల్చున్న దొడ్డివైపు తలుపు తీశాడు.

తలుపు తీసిన అతన్ని చూసి రమణరావు నిర్ఘాంత పోయాడు. "నువ్వా!" అన్నమాట మట్టుకు అతని నోటినుంచి వెలువడింది.

భర్తమాట చెవిన పడంగానే రాజ్యలక్ష్మికి నోటంట మాట వచ్చింది.

"ఈ దొంగ మీకు తెలుసా" అంది భర్తవంక చూసి.

"ఆ తెలుసు. వీడు దొంగకాడు-వీర్రాజు" అన్నాడు రమణరావు భార్యవంక ఒక విధంగా చూస్తూ.

రాజ్యలక్ష్మికి గది గిర్రున తిరుగుతున్నట్టనిపించింది. భర్తా వీర్రాజూ యిద్దరూ అతుక్కుపోతున్నట్లు కనిపించారు. ఆమె కాళ్ళు చచ్చుపడిపోయాయి.

"వీర్రాజు-వీర్రాజు" ఆ మాటలే ఆమెకి వినిపిస్తున్నాయి. భర్త హాలువేపు తలుపు తెరవడంకూడా ఆమెకి తెలియనే తెలియదు.

మామగారు గది ద్వారబంధానికి అడ్డంగా నిల్చుని "వీడా-వీడెందుకొచ్చాడు?" అని ప్రశ్నిస్తున్నారు. అత్తగారు, మామగారు, భర్త, ఆడబడుచు అందరూ ఏవిటో ఒక్కసారి మాట్లాడుకుంటున్నారు. గోడ కానుకుని వీర్రాజు నిల్చుండిపోయాడు. రాజ్యలక్ష్మి అందరివంకా చూస్తోంది.

కాని ఒక్కరిమాటా ఆమె చెవుల్లోకి వెళ్ళడం లేదు. ఆ గదిలో ఆమె, వీర్రాజు యిద్దరే బొమ్మల్లా నిల్చుండిపోయారు.

"ఎందుకొచ్చాడే వీడు?" అని భర్త ప్రశ్నిస్తున్నాడు.

రాజ్యలక్ష్మికి ఆ ప్రశ్న అర్థం అవడంలేదు.

"సమాధానం చెప్పవేం?" అంటూ భర్త గుడ్లెర్ర జేస్తున్నాడు.

"ఏం చెబుతుందన్నయ్యా? ఆవిడకోసం వచ్చి వుంటాడు" అంది ఆడబడుచు సుబ్బులు.

"నువ్వుండవే అమ్మాయ్! ఏమయ్యా ఎందుకొచ్చావ్?" అన్నాడు రమణరావు తండ్రి.

"వూరికినే"

"వూరికినే అర్ధరాత్రి ఆడవాళ్ళ గదుల్లోకి వస్తుంటావన్నమాట" అన్నాడు రమణరావు తండ్రి.

"వాడికా బతుకు అలవాటేగా నాన్నా" అంది సుబ్బులు.

"నీకూ వుందిగా ఆ మాదిరి అలవాటు!" అన్నాడు వీర్రాజు.

దాంతో రమణరావు చెల్లెలు సుబ్బులు తారాజువ్వలా లేచింది, "వెధవ పోకిళ్లూ నువ్వూను. నీ బుద్ధి గడ్డి తిని, నువ్వు యిలా గోడలు దూకుతూ, పైగా పరాయి ఆడవాళ్ళనిగూడా అంటావురా—చూస్తావేం నాన్నా. వెధవని నాలుగు తన్నక" అంటూ గబగబ అరుస్తోంది సుబ్బులు.

తండ్రి "సుప్వారుకోవే అమ్మాయ్" అంటూ రాజ్య లక్ష్మివైపు తిరిగి "యీ వెధవ ఎందుకొచ్చాడే నీ గదిలోకి, చెప్పు" అంటున్నాడు.

"ఆవిడకేం తెలియదు. మీకు పట్టుబడకుండా ఉం డాలని యీ గదిలోకి దూరాను. నేను వెళ్ళిపోతున్నా" అంటూ రెండడుగులు ముందుకు వేశాడు వీర్రాజు.

"ఒరే-అబ్బాయ్! చూస్తావేమిరా-నాలుగు తన్నరే. అసలు వాడెందుకు యీ గదిలోకి వచ్చాడో ముందు తేల్చుకు మరీ కదలనివ్వు" అంది రమణరావు తల్లి.

"ఏవేఁ చెప్పు, వాడెందుకొచ్చాడో?" అని అడిగాడు రమణరావు భార్యని.

"ఆవిడకేం తెలియదని ముందే చెప్పాను. మీకు పట్టుబడకుండా వుండాలని యీ గదిలోకి వచ్చాను. ఈ ఇంట్లోకి అసలెందుకొచ్చానో చెప్పమన్నారా?" అన్నాడు వీర్రాజు.

"అర్ధరాత్రి యీ గోలేమిటిగాని, వీడిని పోనియ్యండి" అన్నాడు మామగారు.

"పోనివ్వడ మేమిటండీ యీ సంగతేమిటో యివ్వా ళతో తేలాలి. అసలు అది యిలాంటి వెధవ పనుల కెందుకు దిగిందో కనుక్కోకపోతే ఎట్టా?" అంది అత్తగారు.

"ఎందుకొచ్చావోయ్ చెప్పు?" అన్నాడు మామ గారు.

"నేను మీ యింటికి యిలా రావటం యిది మొదటి సారి కాదు. చాలాసార్లొచ్చాను" అన్నాడు వీర్రాజు.

"చూశారా? ఇదేం మర్యాదస్తుల కొంపా లేక అలగా కొంపా? వాడల్లా కుండబద్దలుకొట్టి తమ మధ్య రాకపోక లున్నాయని చెప్తుంటే, తండ్రీ కొడుకులు వాజమ్మల మాదిరి ఊరుకుంటారేం, ఇద్దర్నీ తన్ని తరిమెయ్యక! పూఁ-నడవ్వేఁ-వాడితో నే పో" అంది అత్తగారు.

"నే చెప్పేదేదో పూర్తిగా వినరేం-మీ యింటికి చాలాసార్లు వచ్చాననన్నాగాని, ఈమెకోసం వచ్చానని చెప్ప లేదే! మధ్యని ఆవిడ నెందుకంటారో అర్థం అవడంలేదు" అన్నాడు రాజు.

"ఆ మహాతల్లికోసం రాక, నా కొడుక్కోఁ-సం వచ్చావా? లేక మా దొడ్లో జామిపండ్లకోసం వచ్చావా? నడు నడు, పిచ్చి వేషా లెయ్యక-కదలవేం పద..."

"ఉండవె అమ్మా - అతను చెప్పేదేమిటో పూర్తి గానీ!"

"ఏమిట్రా, వెధవ వాజమ్మలా. ఇంకా నీ పెళ్ళాన్ని ఏలుకుందామనే! ఛీ! అభిమానం లేకపోతే సరి - దాన్ని యింట్లోంచి గెంటమంటుంటే!"

"నువ్వు ఊరుకోవే - నువ్వు చెప్పేదేదో చెప్పవయా" అన్నాడు రమణరావు తండ్రి.

వీర్రాజు సుబ్బులు వంక చూస్తున్నాడు.

సుబ్బులు "అమ్మా మనకెందుకే - అన్నయ్యకీ,

నాన్నకీ యిష్టం అయితే మనకేం మధ్య—పోయి పడుకుందాం పద" అంది.

"నువ్వు నోరు మూసుకోవే సుబ్బులూ" అన్నాడు రమణరావు.

సుబ్బులు ఆరున్నొక్కటి అందుకుంది; తల్లి వోదారుస్తోంది.

"ఇంతకీ చెప్పవేమిటోయ్" అన్నాడు రమణరావు.

"ఇదుగో, మీరు నమ్మితే నమ్మండి - లేకపోతే లేదు. పాపం! నామూలాన యీావిడ కాపరం గంగలో కలుస్తోందంటే జాలిగా వుంది. నేను మీ అమ్మాయి కోసం వస్తున్నాగాని — ఈవిడకోసం కాదు. ఈమె మొహం నేనెన్నడూ చూడనైనా లేదు."

సుబ్బులు గుండెలు బాదుకు ఏడుస్తోంది. తల్లి వీరాజుని నోటికొచ్చినట్లు తిడుతోంది. రమణరావూ, తండ్రీ తేరిపార చూసుకుంటున్నారు. రాజ్యలక్ష్మికి ఏమీ వినిపించడం లేదు.

"ఈ వెధవని నమ్మితే రెండు చేతుల్తో గొంతు కోసుకున్నట్లే. నా కూతురినే అంటాడూ! అదీ వాడూ లాలూచీ అయి, పసిదాన్ని అంటున్నారు. ఏమండీ వూరుకుంటారేం! ఆ వెధవకి పెళ్లాంమీద మోజు. తన్ని తగలెయ్యండి ఇద్దర్నీ — వూరుకుంటారేం చూస్తూ" అని అంది రమణరావు తల్లి.

రమణరావుకి అయోమయంగా వుంది. ఏమయినా,

అతను రాజ్యలక్ష్మిని పూర్తిగా నమ్మనూ లేదు; నమ్మకుండా వుండనూ లేదు. రమణరావు తండ్రీ అదే స్థితిలో వున్నాడు.

వీర్రాజు నుల్చున్న చోటునించి కదిలాడు.

"దాన్ని గూడా నీతో తీసుకుపో, మా ఇంట్లో ఎందుకీ తంటా" అంది రమణారావు తల్లి.

రమణరావు రాజ్యలక్ష్మి వంక చూడకుండా అటు తిరిగి నుల్చున్నాడు. రమణరావు తండ్రి రాజ్యలక్ష్మి వంక తీక్షణంగా చూస్తున్నాడు.

"ఇదుగో, నే చెప్పేది వినండి. నేను రౌడీనే, మంచి వాడిని కాదు. ఐనా, నాకూ పాపభీతి వుంది! ఈ అమ్మాయి అమాయకురాలు. ఆవిడని ఏ బాధలూ పెట్టకండి" అన్నాడు వీర్రాజు.

అంతవరకూ రాజ్యలక్ష్మిమీద ఏమూలో వున్న సాను భూతి, వీర్రాజు మాటల్తో గుప్పన ఆరి పూరుకుంది. రమణ రావుకి ఏదో కోపం, అక్కసు వుబికివస్తోంది.

"వెధవ ధర్మపన్నాలు చెబుతావట్రా నువ్వు. ఫో. దాన్నితీసుకు మరీ పో, కదలవేమే, కదులు" అన్నాడు రమణ రావు.

దానితో "అమ్మో" అని రాజ్యలక్ష్మి చాప చుట్టగా భర్తకాళ్ళమీద పడింది. కాని అతని హృదయం కరగలేదు.

ఈ నాటకం అంతలోనూ రాజ్యలక్ష్మి మీద కాస్త దయా జాలీ కనబరిచింది ఒక్క వీర్రాజే. అమాయికను,

ఏదో సంసారం చేసుకుంటున్న ఆడదాన్ని, తను దెబ్బలు తినకుండా తపించుకుంటానికి, చిక్కుల్లోకి లాగాడు; ఏ పాపం ఎరగని స్త్రీ తనవల్ల యిల్లూ వాకిలీ లేనిది అయిపోతోంది. సుబ్బులు నడత ఆ వూర్లో ఎవరికి తెలీదూ? అందులో సుబ్బులుతల్లి ఎన్నిసార్లు తలుపు అలికిడి అయితే, ఎరగనట్టు వూరుకో లేదూ! అన్నీ తెలిసికూడా, అందరూ యీపరాయి పిల్లని, వీధిలోకి యీడ్చాలని చూస్తున్నారు. వీర్రాజుకి రాజ్యలక్ష్మిమీద ఎంతో గౌరవం కలిగింది.

"మీ కంత అక్కర్లేకపోతే, వదిలెయ్యండి. వారికన్న వారింట్లో నేనే దిగవిడిచి వస్తా. పదండి. తెలిసీ మిమ్మల్ని అల్లరిపాలు చేస్తుంటే, యింక చేసేదేముంది? లేవండి" అన్నాడు వీర్రాజు రాజ్యలక్ష్మి నుద్దేశించి.

వీర్రాజు మాటలు రాజ్యలక్ష్మి జీవితాన్ని యినప సంకెళ్ళతో పూర్తిగా బంధించేశాయి. ఇంతవరకూ ఊరుకున్న మామగారు;

"యింకేం వెళ్లు—అతను తీసుకెళ్తాడటగా!" అన్నాడు వెటకారంగా.

మామగారుతీసిన అర్థం వీర్రాజుని నిశ్చేష్టుడినిచేసింది. అతని నెత్తురు వుడికెత్తిపోయింది.

"ఎంత దొంగ గడ్డి తిన్నా, మీకంటే నిజాయితీ నియమం మాకే వుంది. ఏవిటయ్యా! ఇందాకటినుంచీ వూరుకుంటున్నా. నీ కూతురు సంగతి తెలియనంత మునీశ్వరుడవా అంటా? మూడేళ్ళయి ముండమోసి, నీ కూతురు యింట్లో

వుండీ, వెధవ ఆటలు ఆడుతుంటే వూరుకుంటివి. పరాయి అమ్మ కన్నపిల్ల కాబట్టి యిన్నిమాట లంటుంటివి. పదమ్మా, వాళ్ళకంటే రాక్షసులు నయం! వెధవకక్కుర్తి మనుషులు. రా—నావెంట తీసుకుపోతా" అని రాజ్యలక్ష్మి రెక్కపుచ్చుకున్నాడు వీర్రాజు. అతని చెయ్యి తగిలే వేళకి, నిలువెల్లా కంపించింది రాజ్యలక్ష్మికి.

భర్త, మామగారు, అత్తగారు, ఆడబిడ్డ ఎవరూ అతన్ని అడ్డుపెట్టలేదు. రాజ్యలక్ష్మి భర్త ముఖంవంక ఒక్కసారి చూసింది. అతని కళ్ళలో కరుణ, జాలి, ప్రేమ ఏమీ లేవు. ఒక్క క్రోధంమటుకు వుంది. రాజ్యలక్ష్మి రాత్రి పన్నెండు గంటలవేళ వీర్రాజుతో ఆ యిల్లు వదలి బయటికి వచ్చింది.

## 2

అర్ధరాత్రి ఎక్కడా అలికిడి లేదు. చీకటివీధిలో మునిసిపల్ దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయ్. వీర్రాజు ముందు నడుస్తున్నాడు. వెనక రాజ్యలక్ష్మి నడుస్తోంది. ఇద్దరికీ తమ స్థితి అయోమయంగా వుంది.

ఆ అమ్మాయిని ఏదో ఉద్రేకంలో యింట్లోంచి రమ్మనమన్నాడే గాని, ఆపైన ఏంచెయ్యాలో అతనికి బోధపడటం లేదు. ఏడాదినుంచీ అతనికి సుబ్బుల్తో సంబంధం ఉన్నది. ఆరు నెలలయి-అత్తారింటికొచ్చిందంటే పిల్ల! ఈ పిల్ల సారె చలిమిడీ, భార్య తనకి పెట్టడం బాగా జ్ఞాపకం వీర్రాజుకి. అయినా ఒక్కనాడూ యీ పిల్లని అతను చూడలేదు.

తనభర్తకి, సుబ్బులుకి సంబంధం వుందని వీర్రాజు భార్యకి మనసులో అనుమానంగా ఉండేది, అందుకే భార్యకి సుబ్బులంటే అక్కసు. ఆరాత్రి చలిమిడిపెట్టూ, సుందరయ్య గారి కోడలు ఎంతమంచిదో, ఎంత అణుకువైనపిల్లో పావు గంట సేపు చెప్పింది. అందుకే వీర్రాజుకి యీ అమ్మాయి కాపురానికొచ్చి ఆరునెలలే అయిందని స్పష్టంగా తెలుసు.

తను దెబ్బలకి భయపడి, ఆ పిల్ల గదిలోకి ఆ ప్రకారం వెళ్ళడం బుద్ధితక్కువ పని అని, అప్పటికో వెయ్యిసార్లు లెంప లేసుకుని వుంటాడు మనసులో. కాని, ఏం లాభం ? ఆ అమ్మాయి కాపరం గంగపాలయింది.

అన్నిటికంటే ఆ పిల్ల మాటలాడక పోవడం. పోనీ, నాలుగతనని తిట్టనన్నా తిట్టకపోవడం వీర్రాజుకి చాలాకష్టంగా వుంది. పోనీ, ఏడవనన్నా ఏడవదేం; అలా నీడలా తన వెనక వస్తోంది. అతని మనసులో రాజ్యలక్ష్మి పట్ల జాలికి బదులు భయం ప్రవేశిస్తోంది.

ఈ అమ్మాయితో ఇంత రాత్రి వేళ ఎక్కడికెళ్ళటం? బయట తను ఎలా తిరిగినా, ఎన్ని వేషాలేసినా, ఇంటిదగ్గిర సరిగా వుండకపోతే, తండ్రి కాళ్ళు విరగకొడతాడు. వూళ్ళో తనకి రౌడీ వీరాజని పేరుంది. వూరంతా తనంటే దడుస్తారు. కాని; తండ్రిని చూస్తే మటుకు తనకి గజగజ మంటుంది ప్రాణం.

ఈ పిల్లని తీసుకు అర్ధరాత్రి తను యింటికెళితే, తండ్రి నానా గోలా చేస్తాడు. తన పిల్లలు లేచి ఏడుస్తారు. పెళ్ళాం

పెడబొబ్బలు పెడుతుంది. అంచేత, రాత్రల్లా స్టేషనులోగడిపి, తెల్లారగట్ల నాలుగ్గంటల బండిలో యీ అమ్మాయిని వాళ్ళ కన్నవారింట్లో వదిలివేస్తే, తన బాధ్యత తీరిపోతుంది. ఆపైన వాళ్లూ వాళ్లూ చూసుకుంటారు.

వీర్రాజు నడక ఆపి_వెనకి - తిరిగాడు. రాజ్యలక్ష్మి ఏదో భూతాన్ని చూచినట్లు, నాలుగు అడుగులు వెనక్కి వేసింది.

"నేను మిమ్మల్నేం చెయ్యను. ఈ రాత్రికి స్టేషనులో కూచుందాం. తెల్లారి మీ పుట్టింట్లో దిగబెడ్తాను" అన్నాడు వీర్రాజు.

"నేను మా వాళ్ళింటికి వెళ్ళను." అంది ఆ అమ్మాయి దృఢంగా.

వీర్రాజు ఆశ్చర్యపోయాడు.

"ఏం?"

"అక్కడ నాకెవ్వరూ లేరు. అదీగాక యిక్కడింత జరిగాక_అక్కడమటుకు యింకేం జరుగుతుంది? నే నింటికి వెళ్ళను" అంది రాజ్యలక్ష్మి.

వీర్రాజుకి అయోమయంగా వుంది. తానేదో పెద్ద వూబిలోకి కూరుకుపోతున్నానేమోనని భయంగా వుండటనికి. పుట్టింటివారికి భయపడి వెళ్ళనంటోందేమోనని అనుమానంగా వుంది. ఏమయినా స్టేషనుకి జేరాక, ఆ అమ్మాయిని ఒప్పించి, పుట్టింట్లో దిగబెడితే, తన బాధ్యత తీరిపోతుందనుకున్నాడు.

ఇద్దరూ స్టేషనుకి జేరుకున్నారు. అది చాలా చిన్న స్టేషను. ఆ ఊళ్ళో మెయిలు బళ్లూ, గూడ్సు బళ్లూ ఆగవు. పాసింజర్లుమటుకు ఆగుతాయి. స్టేషనులో అందరూ నిద్దరోతున్నారు. నూనె మిఠాయి కొట్టువాడు, అరటిపళ్ళ షాపువాడు కూడ కొట్టు మూసుకున్నారు. తెల్లారిగట్ట నాలుగింటిదాకా బండిలేదు. అందుకేఅందరూఆదమర్చినిద్దరపోతున్నారు. ప్లాట్ఫారమ్‌మీదవున్న మూడు బెంచీలమీద పోర్టర్లు పడుకుని నిద్దరోతున్నారు. వీర్రాజు రాజ్యలక్ష్మిని ప్లాట్‌ఫారమ్ చివరికి తీసుకెళ్ళి, అక్కడ ఎత్తయిన బండరాయివుంటే, దానిమీద కూచోమన్నాడు.

రాజ్యలక్ష్మి ఆ రాతిమీద చతికిలబడింది. వీర్రాజు కొంచెం దూరంలో కూచుని సిగరెట్టు ముట్టించాడు. ఒక్క సిగరెట్టు బాగ పీల్చి జేబులో చెయ్యిపెట్టి డబ్బులు బయటికి తీశాడు. జేబులో రెండు రూపాయిల కాయితాలు, చిల్లరా వుంది. అతని గుండె గతుక్కుమంది. ఈ అమ్మాయి వూరు వెళ్ళాలంటే డబ్బు కావాలి, డబ్బుకోసం ఇంటికెళ్ళాలి. అంతదాకా యీ అమ్మాయిని ఏం చెయ్యడం? ఈ ఆలోచన తెగటంలేదు. రాజ్యలక్ష్మి తలకాయ వంచుకు కూచుంది.

"ఇదుగో చూడండి" అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి నిద్దరనుంచి మేలుకున్నట్లు ఉలిక్కిపడి అతనివంక చూసింది.

"నా జేబులో డబ్బులేదు. ఇంటికెళ్ళి పైకం తెస్తాను. మీరిక్కడే కూచోండి. ఓ అరగంటలో వస్తాను." అన్నాడు వీర్రాజు.

"నిజంగా తిరిగి వస్తారా?" అని అడిగింది.

అతని గుండె కలుక్కుమంది. పాపం! ఈ స్థితిలో యీ అమ్మాయికి తనొక్కడే దిక్కుగదా!

"తప్పకుండా వస్తాను. మీ పుట్టింట్లో దిగవిడిస్తేగాని నాకు మనశ్శాంతిగా ఉండదు." అన్నాడు.

"నాకు పుట్టిల్లు లేదు." అంది వెనకటి మాదిరే దృఢంగా.

"అంటే?"

"నాకు అమ్మా నాన్నా లేరు"

"అన్నదమ్ములు?"

"ఒక్క అన్నయ్య వున్నాడు. అయినా అది పుట్టిల్లు గాదు. అక్కడి కెళ్ళను." అంది నిశ్చయంగా.

"ఆ సంగతి తర్వాత మాట్లాడుకుందాం. ముందు డబ్బు తెస్తాను. పోర్టరుని లేపుతా. అతను నాకు తెలిసిన వాడే మీ కేం భయం వుండదు."

"అక్కర్లేదు. నాకేం భయంలేదు. మీరు తప్పకుండా తిరిగొస్తారా? నిజం చెప్పండి." అని అడిగింది రాజ్యలక్ష్మి.

"తప్పకుండా, అరగంటలో వస్తా" అని లేచాడు వీర్రాజు.

ఎంత రౌడీ అయినా, ఎంత కిరాతకుడు ఐనా ఏ మూలో హృదయం వుంటుంది. ఆ హృదయం స్పందించినప్పుడే ఎంత చెడ్డవారైనా ఎంతో సాధువై పోతారు.

రాజ్యలక్ష్మి తనని 'అండీ' అని సంబోధించడంతో వీర్రాజుకు ఒక విధమైన ఆనందం కలిగింది. అతన్ని యింత వరకూ, ఎవరూ ఇలాటి గౌరవంతో సంబోధించలేదు. తండ్రి సరే సరి. తండ్రి అంటే వీర్రాజుకి సింహస్వప్నం. మేనత్త కూతురయిన భార్య అతన్నెప్పుడూ 'నువ్వు' అనే పిలుస్తూ వుంటుంది. వూళ్ళో వాళ్ళలో కొందరు 'ఒరేయ్' అని మరి కొందరు 'ఏమోయ్' అని పిలుస్తూంటారు. 'ఏమయ్యా' అని కూడా పిలవలేదు ఎవరూ అతన్ని ఇంతవరకు. అలాటిది ఆ అమ్మాయి తనని గౌరవంతో సంబోధిస్తుంటే అతని హృదయం కదిలింది. ఆమెపట్ల అతనికి ఎంతో పశ్చాత్తాపం కలిగింది.

డబ్బు బాగా ఉండటంవల్ల, ఒకే ఒక్క కొడుకు అవడంవల్ల అతనికి చదువు అబ్బలేదు. మనిషి బావుంటాడు. వయసు వచ్చినప్పటినుంచీ, వీర్రాజు తనకంటే పెద్ద కులాల స్త్రీలతో బాంధవ్యం పెట్టుకుంటూండేవాడు. రంగేళీ పురుషుడు ఒక రకంగా. స్త్రీలు అతన్ని గౌరవించలేదు; అతను స్త్రీలని గౌరవించలేదు. ఇంతవరకూ అనుభవంకాని ఏదో కొత్తరకమయిన ప్రేమ పుట్టుకొచ్చింది రాజ్యలక్ష్మిమీద అతనికి. ఆమె అందాన్ని కాంక్షించడంలేదు. ఆ అమ్మాయిని తను కాపాడాలి అనే భావం; అయ్యో పాపం అనిపించే ప్రేమ.

యింటికి వెళుతూ ఒక్కసారి ఆ అమ్మాయి వంక పరకాయించి చూశాడు. అర్ధరాత్రి వంటరిగా అలా చెట్టు కింద, యిరవై ఏళ్ళయినా నిండని ఆ అమ్మాయి కూచుని

వుంది. ఇటువంటి దృశ్యం అతని నోటంట ఓ దూకుడుమాట పుట్టిస్తుంది సాధారణంగా. కాని ఈ రాత్రి, తనవల్ల సర్వస్వం కోల్పోయిన, ఆ పిల్లమీద కరుణ కలిగింది. ఒక్కసారి ఆ నల్లని తలపై చెయ్యిపెట్టి "నీకేం భయంలేదని" బుజ్జగిద్దామనిపించింది. కాని, ఆ అమ్మాయిని తాకడమే!

వీర్రాజు వెళ్ళిపోయాడు. అతను కంటినుంచి దూరం అవడంతో మొట్టమొదటిసారి ఆ రాత్రి జరిగిన సంఘటన ఎంత దారుణమయిందో తెలిసొచ్చింది రాజ్యలక్ష్మికి. మొద్దుబారిపోయిన ఆమె మెదడులోకి భయం ఒంటరితనం ఇత్యాది ఆలోచనలు దూకుతున్నాయి.

వీర్రాజు ఇంక రాకపోతే తనేం గావాలి? అనే ఆలోచనలతో కన్నీరు కట్టలు తెంచుకు ప్రవహించడం మొదలు పెట్టింది. రాజ్యలక్ష్మి కన్నీళ్లు తుడుచుకోలేదు.

ఆరు నెలలక్రితం రాత్రివేళ, ఈ స్టేషనులోనే రైలు దిగింది. వెంట భర్త వున్నాడు. అతను దిగి, పెట్టెదించి చెయ్యి అందించాడు. తాను మరచెంబుతో పాటు కిందకి దిగింది. మొన్నలావుంది తన మనసుకి. అయిపోయింది ఆ జీవితం — ఆ రోజులు అయిపోయాయి.

తను పుట్టింటికెళ్ళి ఏంజేస్తుంది? ఎవరున్నారు తనకి? తండ్రిలేడు, తల్లిలేదు. సవితి అన్నగారున్నారు. తనకీ అన్నకీ అంత పొత్తు లేనేలేదు. వదిన అన్నట్లు తను దురదృష్టవంతురాలే! కాకపోతే యిలా జరుగుతుందా! పుట్టగానే తల్లి పోయింది. పదో ఏట తండ్రి పోయాడు. పెళ్ళిచేస్తే తన సంసారం యిలా అయింది.

నలుగురు పిల్లల్లోవున్న అన్న తనని ఆదరిస్తాడా? అసలే చాలీచాలని జీతం, పైపెచ్చు రెండువేలు కట్నం యిచ్చి పెళ్ళిచేశాడు. తను చేతులారా సంసారాన్ని పాడుచేసుకుంటే, వాళ్ళొచ్చి అడ్డుకుంటారా?

వదిన వద్దంటున్నా వినక, మంచి సంబంధం అని, రెండువేలుపోసి పెళ్ళిచేశాడు. తనెంత పొంగిపోయింది! ఒక్కగా నొక్కకొడుకు. ఆయన బి. ఎ. చదువుతున్నాడు. ఇంక తన కష్టాలు గట్టెక్కాయి అనుకుంది. పెళ్ళి అయ్యాక వదిన తిట్లు, పిల్లలమోత, అన్నీ తప్పి అత్తవారింటికొచ్చిన రోజున ఎంత సంతోషపడింది! అల్లాంటిది మళ్ళీ పుట్టింటికా? లాభంలేదు. ఇక్కడ మాటలొకటే పడింది, అక్కడ తన్నులుగూడా తినాల్సివస్తుంది. తనకేనాడు తల్లీతండ్రీ లేరో, ఆనాడే పుట్టిల్లూ లేదు.

ఈ సెప్టెంబరుతో బి. ఎ. అయిపోతే మరుసటి ఏడు, ట్రయినింగ్ అయితే ఆయన టీచరు చేస్తాడని ఎంత సంబరపడింది? ఎన్నికలలు కంది. అంతా అయిపోయింది. ఆ స్వప్నాలన్నీ అయిపోయాయి.

ఒక్కసారి వెనక్కి తలతిప్పి చూసింది. వీర్రాజు జాడ కనిపించడంలేదు. అతనింక రాడేమొ? రాకపోతే ఎల్లా? అతన్ని త్వరగా పంపమని దేవుణ్ణి ప్రార్థిస్తే? ఏమో! తన కాపరం నిలబెట్టమని దేవుణ్ణి ప్రార్థిస్తే నిలబెట్టాడా? లేదే! ఇంటిదగ్గిర పెళ్ళాం దెబ్బలాడుతోందేమో! డబ్బు దొరకలేదేమో!

పాపం! వీర్రాజు పెళ్ళాం చాలా మంచిది. తను యీ వూరువచ్చిన మూడోరోజున వీర్రాజు పెళ్ళాం రమాయమ్మ తనని చూట్టానికి వచ్చింది. కుడిబుగ్గమీద గుండ్రని పుట్టుమచ్చ, పచ్చని వొళ్ళు. ఎంతో బావుంటుంది రమాయమ్మ. అంత చక్కని పెళ్ళాం వుండగా, ఈ వీర్రాజుకి గోడలుదూకే రోగమెందుకో?

రమాయమ్మ ఎంత చక్కగా మాట్లాడిం దా రోజున! ఎర్రని చుట్టుచెంగావి కోకతో ఎంతో బావుంది. పిల్లాడిని ఎత్తుకు, ఆడపిల్లని నడిపించుకుంటూ తీసుకొచ్చింది.

"ఏం రమాయమ్మా, మీ ఆయన ఏమన్నా బాగు పడ్డాడా?" అని అడిగింది తన అత్తగారు.

"ఏం మారతారమ్మా, ఆళ్ళ బాబు-అంటే మా మాం గారు లేరూ - ఆయనా ఇంతేట!"

"అంతే నంటావ్!"

"ఆళ్ళ కేం మొగాళ్ళు — ఎట్టాయినా తిరుగుతారు. ఏమయినా పిన్నమ్మగారూ, మాంగారంటే భయం. అంచేత నన్నేం అనడు."

"పోనీలే అదీ నయమే."

"బయట ఎట్టా తిరిగితే ఏం. ఇంటికాడా పిల్లిలా గుంటాడు" అని తెల్లనిపళ్ళు బయటపడేటట్టు ఫక్కున నవ్వింది రమాయమ్మ.

అదే మొదటిసారి వీర్రాజు పేరు తను వినడం. రమాయమ్మ వెళుతూ దగ్గిర కొచ్చి రహస్యంగా,

"చూడండి కోడలుగారూ, మీ ఆడబిడ్డ సుబ్బులమ్మ లేదూ-మా చెడ్డది — కాస్త కనిపెట్టి ఉండండి" అని చెప్పింది.

ఆమాట అర్థం తనకి తెలియలేదు. అయినా సుబ్బుల్లో తనకి చెడ్డతనం ఆట్టే కనిపించలేదు. ఏదో పాపం! పూర్వ జన్మ ఖర్మఫలం, వైధవ్యం వచ్చింది. అత్తగారికి కూతు లంటే ఆపేక్ష. అయితేనేం, ఎవరి కుండదు! తన తల్లి బతి కుంటే తనని ఆపేక్షగా చూడదూ? అతని బి. ఏ. పూర్త యితే తనకీ అంతే చాలనుకుంది.

మళ్ళీ మరోసారి తలతిప్పి చూసింది. వీర్రాజు జాడ ఎక్కడా కనుపించలేదు.

వీర్రాజు రాకపోతే ఏం చెయ్యాలి ? మళ్ళీ ఇంటికెళ్ళి పోతేనో-అమ్మో రానిస్తారా! అంతఅదృష్టం కూడానా!

సుబ్బులు ఎంతయినా, అంతచెడ్డదనుకోలేదు. అందుకే కాబోలు ఎప్పుడూ వీర్రాజు మాటలు ఎత్తుతుండేది. అతను పోకిరీవాడని తిడుతూండేది. అతని పెళ్ళానికి అహంభావం అనేది. వీర్రాజుకి డబ్బుంటం వల్ల ఇలా ఆడవాళ్ళని అల్లరి పెడుతున్నాడనేది. తానొక్కరోజు వీర్రాజు మీద సుబ్బులకి వూహించలేక పోయింది. అతనితో మనస్సుందనీ, సంబంధంవుండి, అతన్నెందుకు అలా రోజూ తిట్టేదో ? ఆ వీర్రాజుముఖం తను యీ ఆరునెలల్లో ఒక్కసారిగూడాచూడ లేదు. చూసుంటే, వాడు గదిలోకి రాగానే, అరిచివుండేది. అసలు గదిలోకి రానిచ్చేదేగాదు. వెధవ, పరువు తీశాడు. వాడి పీక పిసికేసి ఉంటే బాగుండేది. వెధవ. అడుగుల

చప్పుడుతో తలెత్తి చూసింది. ఎదురుగుండా వీర్రాజు. అయితే తనని మోసం చెయ్యలేదన్నమాట. తిరిగివచ్చాడు.

ఎందుకొచ్చాడు వీడితో ఎక్కడికెళ్లాలి? మళ్ళీ తనింటికి పారిపోతేనో?

"కొంచెంసేపు నిద్రపోండి" అన్నాడు వీర్రాజు. రాజ్యలక్ష్మి తలతిప్పింది.

"బండి నాలుగు గంట్లకిగాని రాదు. మీ పుట్టిల్లు విశాఖపట్నంకదూ?"

"నే విశాఖపట్నం వెళ్ళను."

"మరి ఎక్కడికెడతారు?"

"ఏమో."

"మీ రెక్కడికెడతానంటే? అక్కడదింపుతా."

"ఏదన్నా అనాధశరణాలయంవుంటే – అక్కడికి తీసుకెళ్ళండి" అంది రాజ్యలక్ష్మి.

అతను నిర్ఘాంతపోయాడు ఆ మాటలకి. తాను చేసిన తప్పుకి, యీ పిల్లకి- పండంటి సంసారం పోయి అనాధశరణాలయం ప్రాప్తిస్తుందా? ఇది ఎక్కడన్నా వుందా? తను వొచ్చింది సుబ్బులుకోసం. అందరూ దొంగ అనుకున్నారు. చివరికి ఏమీ ఎరగని యీ పిల్లని అనాధని చెయ్యడానికి తను సుబ్బులుకోసం వెళ్ళాడన్నమాట. ఇదా–పర్యవసానం!

"మీ కేదన్నా ఆశ్రమం తెలుసా?" అని అడిగాడు వీర్రాజు.

"మద్రాసులో మహిళాసదనం వుందిట. రాజమండ్రీ అయినా ఫరవాలేదు."

"అయితే ముందు బెజవాడ కెళదాం. అక్కడ నా స్నేహితుడున్నాడు. వాడికి వివరాలు తెలుస్తాయి. వాడి ద్వారా మద్రాసు లోనో, రాజమండ్రిలోనో చేరుస్తా," అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి మాట్లాడలేదు. అతనూ మళ్ళీ మాట్లాడలేదు.

బెజవాడ వెళ్ళేబండి నాలుగున్నరకి వచ్చింది. ఇద్దరూ నిశ్శబ్దంగా ఎక్కారు. వీర్రాజు చేతిలో చిన్న సంచీ వుంది. రాజ్యలక్ష్మి కట్టుబట్టల్తో రైలెక్కింది.

ఏడుగంటలకి బెజవాడ చేరుకున్నారు. తెల్లగా తెల్లారిపోయింది. రాజ్యలక్ష్మి బెజవాడ ఎప్పుడూ చూడలేదు. అసలు విశాఖపట్టణం తప్పించి రాజ్యలక్ష్మి ఏ ఊరూ ఎరుగనే ఎరుగదు; అత్తవారింటికి వచ్చింది. అంతే!.....

స్టేషన్‌లో దిగి, రెండు సైకిల్ రిక్షాలు కుదిర్చాడు వీర్రాజు. రిక్షాలు కాఫీహోటల్ గుమ్మందగ్గర ఆగాయి. రాజ్యలక్ష్మిని రిక్షాలో కూచోబెట్టి హోటలు లోపలికెళ్ళి, గది మాట్లాడి, సర్వర్‌తోపాటు తిరిగి వచ్చాడు వీర్రాజు. సర్వరూ, వీర్రాజూ, రాజ్యలక్ష్మి ముగ్గురూ మేడమెట్లు ఎక్కారు.

గదితాళం తెరిచాడు సర్వరు. లోపల ఒక మంచం, కుర్చీ, బల్లా, బట్టలస్టాండూ, ఒక కూజా, గాజు గ్లాసు వున్నాయి. రాజ్యలక్ష్మి పుట్టిబుద్ధెరిగాక, హోటల్లో ఎప్పుడూ

వుండ లేదు. యింతకీ అది హోటలో సత్రమో కూడా ఆమెకి తెలియ లేదు.

సర్వారు నీళ్ళు తెచ్చేందుకు వెళ్లాడు. వీర్రాజు రాజ్య లక్ష్మిని కూర్చోమన్నాడు. రాజ్యలక్ష్మి కిటికీలో కూచో బోతుంటే అలా పక్కమీద కూచోమన్నాడు. రాజ్యలక్ష్మి సంకోచంతో కుర్చీమీద కూచుంది.

సర్వారుని వేపపుల్లలు తీసుకు రమ్మన్నాడు వీర్రాజు. రాజ్యలక్ష్మికి యిదంతా చాలా అశ్చర్యంగా వుంది. సర్వారు రెండు వేపపుల్లలు తెచ్చిచ్చాడు. వీర్రాజు ఒక వేపపుల్ల తీసుకుని, రెండో పుల్ల రాజ్యలక్ష్మికి యిచ్చి, అలా వసారా చివర నున్న బాత్ రూమ్‌లో ముఖం కడుక్కోమని, టవల్ తీసి యిచ్చాడు. రాజ్యలక్ష్మి టవల్ తీసుకోలేదు. సర్వారు చూపించిన దారమ్మట బాత్ రూమ్‌కి వెళ్ళి ముఖం కడుక్కుని, చెంగుతో ముఖం తుడుచుకుని గదిలోకి వచ్చింది.

గదిలోకి వచ్చే వేళకి టేబిల్ మీద కాఫీ, యిడ్డెన్లూ సిద్ధంగా పెట్టి, వీర్రాజు వసారాలో నిల్చున్నాడు. అవేమీ ముట్టుకోకుండా దూరంగా నిల్చుని, కిటికీలోంచి బయటకి చూస్తోంది. అక్కడ కనపడ్డ దృశ్యంతో రాజ్యలక్ష్మికి కన్నీళ్లు తెరలు తెరలుగా వచ్చాయి.

దూరంగా కొందరు స్త్రీలు కుళాయి దగ్గిర బిందెలు పెట్టుకు నుల్చున్నారు. వాళ్ళ ముఖాల్లో చీకూ చింతా లేదు. హాయిగా ఇళ్ళకెళ్ళి, వంటలు వండుకు భర్తలకి పెట్టి సుఖంగా వుంటారు. తనకో...? ఇల్లూ లేదు. భర్తా లేదు.

ఏ పాపం చెయ్యని తనకీ శిక్ష ఏమిటి? కన్నీళ్ళు జలజల రాలి పోతున్నాయి.

వసారాలో నుల్చున్న వీర్రాజు ఆమె కాఫీ ముట్టుకోకపోవడం చూశాడు. లోపలికొచ్చాడు. కిటికీదగ్గర ఏడుస్తూ నుల్చున్న ఆమెను చూచి "ఇంక ఏడవక ఏం జేస్తుంది? తనమూలానే ఆమె కీ తిప్పలు. తానో వెధవ! అందుకే యీ పిల్లకి యిన్ని కష్టాలు. కాని తిట్టుకు ఏం ప్రయోజనం?" అనుకున్నాడు.

"కాఫీ తీసుకోండి."

రాజ్యలక్ష్మి వులిక్కిపడ్డట్టు అతనివంక చూసి తల అడ్డంగా వూపింది.

"మీరు ముందు కాఫీ తాగితే, ఆపైన మంచీ చెడ్డా మాట్లాడుకుందాం. తాగండి" అన్నాడు.

చివరికి రాజ్యలక్ష్మి కాఫీ రెండు గుక్కలు తాగి అసహ్యంతో వదిలేసింది.

"అలా కూచోండి" అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి బెరుగ్గా మంచంమీద కూచుంది. వీర్రాజు కుర్చీలో కూచున్నాడు. అతనికి సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియడంలేదు. ఆ అమ్మాయికి మారు చీరెకూడా లేదు. ఎలా స్నానం చేస్తుంది! అతనికేం పాలు పోవటంలేదు.

"తలుపు లోపల గడియ వేసుకు కూచోండి. ఎవ

రొచ్చినా తలుపు తియ్యకండి. ఓ అరగంటలో అలా బజారు వెళ్ళివస్తా" అన్నాడు.

"నిజంగా వస్తారా?"

"తప్పకుండా. మిమ్మల్ని సదనంలో జేర్చేదాక ఎక్క డికి వెళ్ళను, నా మాట నమ్మండి", అన్నాడు.

రాజ్యలక్ష్మి లోపల గడియ వేసుకుంది. వీర్రాజు బయటికి వెళ్లాడు అతనికి ఆడవాళ్ళతో పరిచయం అయితే వుందిగాని, వాళ్ళకేం వస్తువులు కావాలో ఏమిటో - బాగా తెలియదు! అద్దం, దువ్వెవ, నూనెసీసా యిలా ఒక్కొక్కటి అనుకుంటూ బజారుకెళ్ళి, రెండు చీరెలూ, రెండు రెడీమేడ్ జాకెట్లూ, అద్దం, దువ్వెన, నూనెసీసా, పౌడరుడబ్బా, ఓ జంప ఖానా, ఓ దిండూ తీసుకున్నాడు. అంతకుమించి ఆ అమ్మాయి కేం కావాలో అతనికి తెలియలేదు. తీరా హోటల్ గుమ్మం ముందు కొచ్చే వేళకి, సబ్బుబిళ్ళ మర్చిపోయినట్టు జ్ఞాపకం వచ్చింది. సబ్బుతోపాటే ఓ జత తువ్వాళ్ళుకూడా తీసు కున్నాడు.

అతను గదితలుపు రెండుసార్లు తట్టినమీదట, పేరు చెప్పాక రాజ్యలక్ష్మి తలుపు తీసింది. పొట్లాలన్నీ చూసి ఆశ్చర్యపోనూలేదు; విచారించనూలేదు. వాటివంక కన్నెత్తి చూడక, కుర్చీలో కూర్చుండిపోయింది.

వసారాలోకి వెళ్ళి సర్వరుని పిలిచి వేడినీళ్ళు పెట్ట మని, గదిలోకి వచ్చి "మీరు స్నానంచేసి రండి" అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి అర్థంకానట్లు తలెత్తి చూసింది.

"కుర్రాడు నీళ్ళు పెట్టాడు. మీరు సోపూ తువ్వాలూ తీసుకు స్నానంచేసి రండి. ఆపైన నేనుగూడా స్నానం చేస్తా" అంటూ వీర్రాజు తలనూనె, సబ్బూ వగైరా టేబుల్ మీద పెట్టాడు. రాజ్యలక్ష్మి నూనె ముట్టుకోలేదు; సబ్బు తీసుకోలేదు; అలాగే బాత్‌రూమ్‌లోకివెళ్ళి స్నానంచేసి వచ్చింది. ఆమె పైటచెంగు తడితడిగావుంది. వీర్రాజుకి చీకాకేసింది; కాని పైకేమీ అనకుండా సోపూ తువ్వాలూ తీసుకెళ్ళి స్నానంచేసి వచ్చాడు.

అతను వచ్చే వేళకి రాజ్యలక్ష్మి వసారాలో - డాబా గోడ నానుకుని, వొచ్చేపోయే మనుషులవంక చూస్తోంది. అతను లోపలికెళ్ళి, బట్టలు మార్చుకు, టైము చూసేవేళకి పన్నెండు అయింది.

సర్వరుని పిలిచి భోజనం తెమ్మని చెప్పాడు. గంటనించి డాబా పిట్టగోడ పట్టుకు, రాతిబొమ్మలా నుల్చుంది రాజ్యలక్ష్మి. గదిలో అద్దంముందు తలదువ్వుకుంటున్న వీర్రాజుకి, అద్దంలో రాజ్యలక్ష్మి చెంప, బుజం కనిపించాయి. పరిశీలనగా ఆమె చెంపని చూస్తున్నాడు. పాపం! యిరవై ఏళ్లు గూడా వుండవు. అంత చిన్న వయసులోనే ఆపిల్లకి తనవల్ల యిన్నికష్టాలు!

భోజనం వచ్చింది. వీర్రాజు డాబాలో కొచ్చి "లోపలికి రండి" అని నెమ్మదిగా పిలిచాడు.

గదిలో మధ్యగా, క్యారియరూ, రెండు అరిటాకులూ

వున్నాయి. అతనే వడ్డించేద్దామనుకున్నాడు. కాని ఎంత యినా తను కాపుకులస్తుడు, ఆమె బ్రాహ్మణులాయను! అంతేత సంకోచంతో వూరుకున్నాడు.

ఆకులు రెండూ పరిచి, నీళ్ళు జల్లి, "ముందు మీరు వడ్డించుకోండి, ఆపైన నేను తింటా," నన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి మౌనంగా యిద్దరికీ వడ్డించింది. అతను మామూలుగానే భోంచేశాడు. రాజ్యలక్ష్మి మజ్జిగ మెతుకులు నాలుగు కొరికి లేచింది. రెండు కెళ్ళిలూ వీర్రాజే నమిలాడు. సర్వరు విస్తళ్ళు, క్యారియర్ పట్టుకెళ్ళి పోయాడు.

రాజ్యలక్ష్మి మంచంమీద, తలవంచుకు మాట్లాడకుండా కూచుంది. వీర్రాజుకి మనసంతా గంద్రగోళంగా వుంది. ఇంటిదగ్గిరనుంచి, ఆ ఖంగారులో ఓ అరవై పట్టుకొచ్చాడు; అందులో నలభై అప్పుడే ఖర్చయిపోయాయి. మద్రాసు వెళ్ళాలంటే డబ్బు కావాలి. డబ్బు కావాలంటే మళ్ళీ యింటికెళ్ళాలి. ఈ లోపలే ఊరంతా-తను యీ పిల్లను లేవదీసుకొచ్చాడనే వార్తతో గుప్‌మని వుంటుంది. డబ్బు యెంత కావాలి! ఇంటికెలా వెళ్ళాలి? ఈ పిల్లని అంతదాకా యెక్కడ వుంచాలి? ఈ హోటల్లో ఒక్కర్తే వుండగలదా? ఇలాంటి ప్రశ్నలతో అతని బుర్ర గిర్రున తిరుగుతోంది.

వీర్రాజు ఒట్టి బోళా మనిషి. నాలుగు ' అంటాడు, నాలుగు పడతాడు. అతని బుర్రలోకి పెద్దపెద్ద ఆలోచనలు రావు. ఆ వొచ్చిన రెండూ మూడు, అంటే ఆ పక్కింటి

వారి కోడల్ని ఎలా ఏడిపించాలి ? యీగోడ యెలాదూకాలి? నాన్నని యెలా డబ్బు అడగాలి? యీ మాదిరి ఆలోచనలు వస్తూంటాయి. వాటికి ఎలాగో సామాధానం దొరుకుతూంటుంది. కాని యీమాదిరి బుర్రబద్దలయ్యే సంఘటనలు అతనెప్పుడూ యెదుర్కో-లేదు. అతని కాలూ చెయ్యీ ఎలా వూరుకోదో, నోరూ అలానే వూరుకోదు. అంచేతనే, అతనికి ఈ వ్యవహారం మరీ అయోమయంగా ఉంది. రాత్రినుంచి బెల్లంగొట్టిన రాయిలా కూచోవడం, ఏడవడం, "వూ-ఆ" అంటంతప్ప కనీసం నోరు తెరచి యీపిల్ల తిట్టనైనా తిట్టదేం! ఆ సుబ్బులేనయం. నాలుగుతిడుతుంది, మళ్ళీ వస్తానని దాకా ఏడుస్తుంది! యీ పిల్ల సంగతి, అతనికి అగమ్యగోచరంగా ఉంది.

కుర్చీలోంచి లేచి, డాబాలోకి వెళ్ళి, సిగరెట్టు అంటించి అది అయిపోయేదాకా, డాబాలో పచార్లు కొట్టి, రూమ్‌లోకి వచ్చాడు. రాజ్యలక్ష్మి అలానే, కదలక మెదలక కూర్చునే వుంది.

"తలుపు లోపల గడేసుకోండి. మా స్నేహితుడుదగ్గిర కెళ్ళి సదనం ఎడ్రనూ అవీ తెస్తా" అన్నాడు వీర్రాజు. రాజ్యలక్ష్మి తల వూపింది.

ఈసారి "నిజంగా వస్తారా?" అని ప్రశ్నించలేదు. అందుకు వీర్రాజుకి సంతోషం వేసింది. అంటే యీపిల్ల తనని కొంచెం నమ్ముతోందన్నమాట.

"కొంచెం ఆలస్యం అయినా ఖంగారు పడకండి.

మూడింటికి వాడు కాఫీ తెస్తాడు; తాగండి. నీపాలు పెట్ట కుండా వచ్చేస్తా" అంటూ చెప్పులేసుకు బయట కొచ్చాడు.

బయటకొచ్చాక అతనికి కొంచెం వూపిరి సలిపినట్లయింది. 'అమ్మయ్య' అనుకుని సత్యనారాయణపురంలో వున్న తనస్నేహితుడి కోసం బయలుదేరాడు. బెజవాడలోని కొత్త సినిమాలు అతన్ని వెనక్కి లాగుతున్నా, సదనం విషయం తేల్చుకునేందుకై, స్నేహితుడి కోసం బయలు దేరాడు.

తలుపు లోపల గడియ వేసుకుని, పక్కమీదికి వరిగింది రాజ్యలక్ష్మి. రాత్రినించి కంటిమీద నిద్దరలేదు. కళ్ళు మండుతున్నాయి. తల దిమ్ముగా వుంది. కళ్లు మూసుకుంటే ఒకటే ఆలోచనలు. తన జీవితం ఏమిటవుతుందో—ఏమో! తనకేం తెలియటంలేదు.

రాత్రి తను దొడ్డితలుపు గడియ వేసిగనక వుంటే యీ వీర్రాజు గదిలోకి వచ్చివుండేవాడు కాదు. అతను రాకపోతే, తన జీవితం యిలా నాశనం అయివుండేది కాదు. ఈ ఆరు నెలల్లో ఒక్కసారిగూడా వీధివంక చూడని తనను, అంతా తెలిసిన భర్తే అనుమానిస్తే ఇంక లోకం సంగతి ఏమిటీ? రాత్రి అమ్మా, నాన్నముందు అలా అన్నాడుగాని తన భర్త తనకోసం తిరిగివస్తాడేమో! తనకి అంత అదృష్టమా!

తను వెళ్ళిపోయాక గదిలోకివెళ్ళి పడుకుంటాడు. గది అంతా చిన్నబోయి వుంటుంది. అసలు తను నిజంగా భార్యని

అనుమానించ లేదుగాని, కోపంలో వెళ్ళిపొమ్మనమని అన్నాడు. ఆపైన పశ్చాత్తాపబడి, తెల్లారి వూళ్ళో వెతుకుతాడు. సరాసరి స్టేషనుకొచ్చి రైలెక్కి బెజవాడ వస్తాడు. ఎందుకో అతనికి వీర్రాజు యీ హోటల్లో వుంటాడని నమ్మకంగా వుంటుంది. గబగబ గదితలుపు కొడతాడు. తను తలుపు తెరుస్తుంది. తలుపు తెరిచిన తనను దగ్గరకు తీసుకుని క్షమించమంటాడు. తను అంతా మరిచిపొమ్మనమని సంతోషంతో అడుగుతుంది. ఇద్దరూ ఇంటికెళ్ళిపోతారు.

గది తలుపు ఎవరో కొట్టడంతో రాజ్యలక్ష్మి తన ఆలోచనల్లోంచి దభాలున బయటపడింది. నిజంగా తన భర్త వచ్చాడా? తనని తీసుకెళ్ళడానికి వచ్చినట్లున్నాడు. గభాలున రెండంగల్లో తలుపు తెరిచింది. ఎదురుగుండా సర్వరు కాఫీ కప్పుతో నిల్చున్నాడు. రాజ్యలక్ష్మికి కన్నీళ్ళు ఆగలేదు. కాళ్ళు చచ్చుబడి పోయినాయి. కాఫీ టేబుల్ మీద వుంచి వెళ్ళమని, గది తలుపుమూసి, కాళ్ళీడ్చుకుంటూ మంచం మీద చతికిలబడింది. తన కలలన్నీ కన్నీటిపాలే! తన జీవితానికి యీ వీర్రాజు తప్ప యింకెవ్వరూ లేరు. ఇతన్నించి— యీ రౌడీనుంచి— తప్పించుకుపోవడం ఎలా? తప్పించుకు ఎక్కడికెళుతుంది? ఎవరున్నారు తనకూ? కళ్ళారా చూసి, తనది ఈషణ్మాత్రమైనా తప్పు లేదని తెలిసిన భర్తే, తనమాట నమ్మక ఇంట్లోంచి అర్ధరాత్రి తరిమేశాడే, మరి బయటవాళ్ళు, తనని ఇంకేం నమ్ముతారు?

ఈ వీర్రాజుని, అందరూ రౌడీ అన్నా తనపట్ల ఇంత వరకూ మంచిగానే ప్రవర్తిన్నాడు. జరిగిందేమో జరిగింది,

ఎట్లాగో తను మద్రాసు వెళ్ళి మహిళా సదనంలో చే
తుంది. అక్కడివాళ్ళ కాళ్ళమీదపడి, తన కథ చెబుతుం
వాళ్ళ మనసు కరిగి తనని దగ్గిరకుతీసి, చదువు చెబుతార
తను చదువుకుని, నర్సుపరీక్ష అవుతుంది. నర్సుగా ఆస్పత్రిల
రోగులకి సేవజేస్తూ, తన భర్తని తల్చుకుంటూ కాల
గడుపుతూంటుంది.

వంటినిండా గాయాల్తో, నెత్తురు ముద్దలా ఆస్పత్రి
వచ్చిన, తన భర్తకి సేవజేసి అతన్ని బతికించుకుంటుంది.
అత్తగారూ మామగారూ అంతా తన పవిత్ర ప్రేమకి ఆశ్చర్య
పోతారు. తన నిర్దోషిత్వాన్ని గ్రహించి, తమని క్షమించ
మని అడుగుతారు. భర్త తను లేనిదే బతకలేనని ప్రాధేయ
పడతాడు. ఇటు తనకోసం, తన సేవమీద ఆధారపడ్డ
రోగులు, అటు భర్త - ఇందులో ఏది ముఖ్యం? ఏ
దయినా తనకి భర్త ప్రేమ కావాలి. ఆ పైనే రోగుల సేవ.
ఆస్పత్రి వదలి రోగులవద్ద సెలవు తీసుకుని, భర్తవెంట తను
తిరిగి యింటికి వెళ్ళిపోతుంది. అక్కడ అంతా తనను నెత్తి
మీద పెట్టుకు పూజిస్తారు.

మళ్ళీ తలుపు చప్పుడుతో రాజ్యలక్ష్మి వాస్తవికాని
కొచ్చిపడింది. చుట్టూ చూసింది. తను పొద్దుట చూసిన
హోటల్ గదే! తనపక్క భర్తలేడు. ఆదరించే అత్త -
మామలు లేరు. ఎదురుగా టేబుల్‌మీద చల్లారిన కాఫీకప్పు
గదంతా చీకటిగావుంది. తలుపు మరోసారి చప్పుడయింది.
తలుపు తెరిచింది-గుమ్మంలో వీర్రాజు.

రాజ్యలక్ష్మికి నోటంట మాట రాలేదు. కాళ్ళు వూరికే వొణుకుతున్నాయి.

"చీకట్లో పడుకున్నారే?" అన్న అతని మాటలకి సమాధానం చెప్పకుండా. అక్కడే గుమ్మం దగ్గిరే కుప్పలా కూలిపోయింది. వీర్రాజుకి ఖంగారేసింది.

స్విచ్ నొక్కాడు. రాజ్యలక్ష్మి ఒరిగిపోతోంది. గబ గబ కూజాలో నీళ్ళు గ్లాసులోపోసి, ఆమె తలని ఒక చేత్తో పుచ్చుకుని నీళ్ళగ్లాసు నోటిదగ్గర పెట్టాడు. రెండుగుక్కల నీళ్ళు తాగి రాజ్యలక్ష్మి తెప్పరిల్లి, మంచమీదకొచ్చి కూచుంది.

వీర్రాజు స్థితి అయోమయంగా వుంది. అతను మధ్యాహ్నంయెక్కడున్నాడో, యిప్పుడూ అక్కడే వున్నాడు. టేబుల్‌మీద కాఫీగ్లాసు చూసి మధ్యాహ్నం ఆమె కాఫీ ముట్టుకోలేదని గ్రహించుకున్నాడు.

మహిళాసదనం అడ్రసు వగైరా అంతా తెచ్చాడు; బాగానేవుంది. బెజవాడనుంచి మద్రాసు వెళ్ళాలంటే డబ్బు కావాలి. డబ్బుకోసం తన వూరు వెళ్లాలి. అంతవరకూ ఈ పిల్లని ఏం చెయ్యాలి? ఈ అమ్మాయి యిల్లా యెన్నాళ్ళు వుపవాసాలు చెయ్యాదల్చుకుంది? అలా డాబాలో వెళ్తున్న సర్వరుని పిల్చి రెండు కప్పులు కాఫీ తెమ్మన్నాడు.

కాఫీ వచ్చింది. కుర్చీలో కూచున్న వీర్రాజు కాఫీ తీసుకు, మంచం దగ్గిరగా వచ్చాడు. రాజ్యలక్ష్మి బెదురుగా చూస్తోంది.

"చూడండి, అయిపోయిందేమో అయింది. నా తప్పు వల్ల మీ జీవితం యిలా అయింది. అందుకు మీరు ఉపోషాలు చేసి, కాఫీ మానేసి, ప్రయోజనం లేదు. మిమ్మల్ని త్వరగా సదనంలో జేరిస్తే నాకూ మీకూ గూడా మంచిది. ముందు మీరీ కాఫీ తాగండి" అన్నాడు.

రాజ్యలక్ష్మి మాట్లాడకుండా కాఫీ తాగింది. ఒక అరగంటలో భోజనం తెమ్మని సర్వరుకి చెప్పి మళ్ళీ కుర్చీలో కూచున్నాడు వీర్రాజు. రాజ్యలక్ష్మి తలవంచుకు, కాళ్ళ వేళ్ళకివున్న మట్టెలు సరిచూసుకుంటోంది.

"మీతో కొన్ని మాటలు మాట్లాడాలి" అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఎవ్వరూ లేని అనాథలైతేగాని సదనంలో జేర్చుకోరట."

"నా దగ్గిర డబ్బేం లేదు, నేను అనాథను గాక మరేమిటి?"

"మీకు అన్నగారూ, భర్తా వున్నారు."

"వాళ్ళంతా వదిలేశారుగా—అందుకే అనాథ అంటుంటు."

"సరే. ఆ సంగతి అలా వుంచండి. మనం మద్రాసు వెళ్ళి, మీకు నాలుగూ సమకూర్చి వచ్చేందుకు డబ్బు కావాలి.

రాజ్యలక్ష్మి తల ఎత్తలేదు.

"రాత్రి హడావుడిలో చాలా కొద్ది పైకం తీసు కొచ్చాను. రేపు ఉదయం మొదటి బస్సులో వెళ్ళి, డబ్బు తీసుకు సాయంత్రం బస్సులో వచ్చేస్తాను."

రాజ్యలక్ష్మి వంచినతల ఎత్తలేదు.

"మీరొక్కరూ ఈ హోటల్లో వుండగలరా? లేక ఈ ఊళ్లో మీ చుట్టాలెవరన్నా వుంటే, అక్కడికి తీసుకెళ్ళి దింపుతాను."

"నాకీ ఊళ్లో చుట్టాలూ లేరు; పక్కాలూ లేరు. మీరు రాత్రికి తప్పకుండా వచ్చేస్తారా?"

"తప్పకుండా వస్తా. కాని ఒక కండిషన్ మీదైతేనే వస్తా" అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి సంకోచంతో చూసింది. అందుకు అతనికి నవ్వొచ్చింది. తనెంత స్త్రీలోలుడైనా, ఈ అమ్మాయిని ఆ దృష్టితో చూడదల్చుకోలేదు.

"మీరు ఈ రాత్రీ. రేపూ రెండు పూటలా భోజనం కాఫీ వగైరా, తప్పకుండా తీసుకుంటానంటే, నేను రేపు రాత్రికే తిరిగి వస్తా — లేకపోతే ..." అన్నాడు వీర్రాజు.

"అలాగే" అంది రాజ్యలక్ష్మి.

ఆ రాత్రి రాజ్యలక్ష్మి నాలుగు మెతుకులు తింది. వీర్రాజు భోంచేసి, సిగరెట్టు కాల్చుకుంటూ వసారాలో పచార్లు చేస్తున్నాడు. అతని మనసు ఆ రోజు ఆడుతున్న కొత్త సినిమా మీదికి, పదే పదే పరుగెడుతోంది. కాని ఆ

అమ్మాయిని వంటిగా వదిలివెళ్ళడం యెలా? అందుకనిసినిమా కోర్కె అణచుకుంటున్నాడు.

గదిలో మంచంమీద పడుకుంది రాజ్యలక్ష్మి. క్రిందటి రోజు రాత్రి ఈపాటికి తను భర్తకే, మామగారికీ వడ్డిస్తోంది. కాని ఈ రాత్రి కొత్త వూళ్ళో, హోటల్లో, ముక్కూ మొహం ఎరగని మనిషిని నమ్ముకుని వుంది. తన జీవితం ఏమవుతుందో రేపేమిటో తనకే తెలీదు. అతనెక్కడ పడుకుంటాడు - ఈ గదిలో నేనా? మరో మంచం లేదే? అతను కింద పడుకుని, తను మంచంమీద పడుకుంటే బావుంటుందా? యిలా ఏవో ఏవో ఆలోచనలతో కళ్ళుమూసింది రాజ్యలక్ష్మి.

"ఏవండి, ఏవండి" అన్న పిలుపుతో కళ్ళు తెరచి చూసింది. వీర్రాజు బట్టలన్నీ వేసుకుని ప్రయాణానికి సిద్ధంగా వున్నాడు. రాజ్యలక్ష్మికి ఒక్కసారి సిగ్గు ముంచుకొచ్చింది. తను హాయిగా నిద్దర పోతోందన్న మాట. ఉలిక్కిపడి లేచింది.

టేబుల్‌మీద ఐదు రూపాయల నోటు పెడుతూ "సర్వరుకి, హోటల్ మేనేజరుకి చెప్పాను. మీకేం ఫరవా లేదు కాఫీ, భోజనం తీసుకోండి. ఎందుకైనా అవసరం వస్తుంది-ఈ అయిదూ దగ్గిర వుంచుకోండి. బస్సు టైము అవుతోంది. జాగ్రత్తగా వుండండి. రాత్రికి వచ్చేస్తా"అంటూ గబగబ బయటకొచ్చాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి పక్కమీంచి గబగబ లేచి డాబాలోకి వెళ్ళి నిల్చుంది. మెట్లు దిగి రోడ్డుమీదకి వచ్చాడు వీర్రాజు.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసి, నడిచి వూళ్ళోకి వెళు తున్నాడు.

తన జీవితం సర్వనాశనం అయే దుర్ఘటన జరిగిన రోజు రాత్రి, రాజ్యలక్ష్మి వీర్రాజువంక సరిగా చూడలేదు. అతను కాళ్ళమీద పడ్డప్పుడుగూడా, అతనేదోదొంగఅన్న భయంతో సరిగా చూడలేదు. ఆపైన అతను వీర్రాజు అని తెలిశాక, ఆమె మనసంతా అల్లకల్లోలం అయిపోయింది. అతనితో యించు మించు మూడు గంటలు గడిపింది. అయినా అతన్ని సరిగా పరకాయించి చూడలేదు.

వీర్రాజు రోడ్డుమీదకెళ్ళి, తిరిగి ఒకసారి చూసినపుడు, అతని మొఖాన్ని మొదటిసారిగా చూసింది. పచ్చని పసిమి, నూదిమొనలాటి ముక్కు, విశాలమైన నుదురు, వూచలా పొడుగ్గావున్న అతని ఆకృతి నలుగురిలోనూ ప్రత్యేకంగా కన పడుతోంది.

బాగా తెల్లవారిపోయింది. కిళ్ళీ కొట్టువాడు సగం కిళ్ళీలు అమ్మేశాడు. ఎదుటి హోటల్‌నుంచి సినిమా పాటలు వినిపిస్తోన్నాయి. తన పక్కగదుల్లో వాళ్ళు అప్పుడే స్నానం గూడా ముగించారు. రాజ్యలక్ష్మి గదిలోకి వెళ్ళింది. టేబుల్ మీదవున్న వేపపుల్ల తీసుకు గదికి తాళంవేసి బాత్ రూమ్ లోకి వెళ్ళింది.

ముఖం కడుక్కు వచ్చేవేళకి, సర్వర్ కాఫీ టిఫిన్‌తో తలుపుదగ్గిర సిద్ధంగా వున్నాడు. టేబుల్‌మీద కాఫీ టిఫిన్ వుంచి"స్నానం యిప్పుడు చేస్తారా? కాసేపుండి చేస్తారా?" అని అడిగాడు.

రాజ్యలక్ష్మికి బద్ధకంగా, బడలిగ్గా వుంది. స్నానం చేస్తేనేగాని, ఈ మాంద్యం వదలదు. స్నానానికి నీళ్ళు పెట్టమంది.

టేబుల్ మీద వున్న క్రిందటి రోజు పొట్లాలు విప్పింది. పెద్ద పెద్ద పువ్వులున్న రెండు వాయిల్ చీరెలూ, వాటితోటే రెండు జాకెట్లూ వున్నాయి. రాజ్యలక్ష్మికి ఆ చీరలు ముట్టుకోబుద్ధి పుట్టలేదు. కాని క్రిందటిరోజుగూడా తను చీరె మార్చలేదు. టేబుల్ మీద చీరెల్లోని ఒక చీరె, జాకెట్టూ తీసుకు, సోపు తీసుకు స్నానానికి వెళ్ళింది. స్నానం చేసి తలకు చమురు రాసుకుంది. దువ్వెన తీసుకు దువ్వుకో పోతే, నిన్న వీర్రాజు ఆ దువ్వెనతో దువ్వుకున్న సంగతి జ్ఞాపకంవచ్చి, ఒక్కసారి ఏదో అసహ్యం వేసింది. కాని గత్యంతరం లేదు తను సదనంలో జేరేదాకా ఇలాంటి విషయాల్లో సర్దుకుపోవాలి.

రాజ్యలక్ష్మికి ఏం తోచడంలేదు. నిన్న గది అంతా పరీక్షగా చూడనేలేదు. ఈ రోజు నాలుగు మూలలూ పరకాయించి చూసింది. ఒక మూలగా వీర్రాజు సంచి, కొత్త జంపఖానా చుట్టూ కనపడ్డాయి—పాపం రాత్రి అతనా మూల పడుకొన్నాడు కాబోలు! 'పాపం' ఏమిటి? అలాటివాడిని చీల్చినా పాపంలేదు! ఏ పాపం ఎరుగని తన జీవితాన్ని నాశనం చేశాడు——అనుకొంది!

గది గోడలు మురికిగా వున్నాయి. కిటికీలో దుమ్ము, టేబుల్ మీద దుమ్ము-ఎందరెందరు ఈ గదిలో వున్నారో, ఎందరు తనలాంటి నిర్భాగ్యులు యీ గదిలో గడిపారో!

ఎంత నిర్భాగ్యుడయినా, తనంత అనాథలు మరెవరూ వుండరు.

మళ్ళా డబాలో కొచ్చింది. వీర్రాజు దగ్గిర వుంచుకోమని అయిదు రూపాయలు టేబుల్ మీద ఉంచాడు. ఆ అయిదూ తీసుకు, టిక్కెట్టు కొనుక్కుని తన భర్త దగ్గిర కెళ్ళి కాళ్ళమీద పడితేనో? ఇంట్లోకి రానిస్తారేమో! కళ్ళెదురుగుండా అప్పటిదాకా, గదిలో వున్న తనని, ఏ పాపం ఎరగని తనని, ఇంట్లోంచి తరిమేశారే, అందులో వీర్రాజుతో ఒక రాత్రంతా హోటల్లో గడిపిన తనని శంకించరూ? క్షమించడం అన్నది కలలో మాట. అసలు రాత్రి వాళ్ళు తిడుతున్నా ఆ వీధి గుమ్మంలోనే పడుంటే, తెల్లారి జాలిపడి, లోపలికి రానిచ్చేవారేమో! అప్పుడే లేంది ఇప్పుడు క్షమిస్తారా! అబ్బే లేదు. తనకీ—తన సంసారానికీ పూర్తిగా తీరిపోయింది ఋణం.

మధ్యాహ్నం భోంచేసింది. హోటల్ సర్వరుతో వీర్రాజు ఏం చెప్పాడో ఏమో! వాడు తీరిక అయినప్పుడల్లా గుమ్మం దగ్గిర కూచుని ఆ మాటా యీ మాటా మాట్లాడితున్నాడు. అదీ కొంచెం నయమే. లేకపోతే తనకు పిచ్చెక్కిపోను. డాబా పిట్టగోడ పట్టుకు రోడ్డుమీద వచ్చే పోయే జనాన్ని చూస్తోంది రాజ్యలక్ష్మి. అలా వచ్చే పోయేవాళ్ళని చూస్తుంటే? ఏదో దిగులు; తను ఈ లోకంలో ఏకాకి అయిపోయినట్టు కడుపులో భయం పట్టుకుంది.

ఆ కిళ్ళీకొట్టువాడికి భార్యా పిల్లలూ వుంటారు. ఆ గుర్రబ్బండివాడికి ఇల్లూ వాకిలీ వుంటుంది. ఆఖరికి అడు

క్కనే ఆ బిచ్చగాడి పక్కనకూడా పదేళ్ళ పిల్లవుంది. ఈ లోకంలో అందరికీ తోడూ నీడా వుంది. తనొక్కత్తె ఏకాకి! తనకి తల్లిలేదు. తండ్రీ లేడు, భర్త వుండీ లేడు, 'నా' అన్న వారు ఎవ్వరూ లేరు-ఒక వీర్రాజు తప్ప! ఆ వీర్రాజు మటుకు మళ్ళీ వస్తాడని నమ్మకం ఏమిటి? ఇంటిదగ్గిర తండ్రీ, భార్య యిద్దరు పిల్లలు; ఇందర్నీ వదులుకు తనకోసం వస్తాడని నమ్మకం ఏమిటి? రమాయమ్మ రానిస్తుందా? సుబ్బులు ఏ సందు చివరో కలుసుకు రానివ్వకుండా చెయ్యదూ? వీర్రాజు లేకపోతే తనకి దిక్కెవ్వరు? వీర్రాజు రావాలి. వొస్తే బాగుం డును?

ఆనాడు గజేంద్రుని మొర విన్నాడు శ్రీమన్నా రాయణుడు. తన మొర ఆలకించి వీర్రాజుని తప్పకుండా పంపకూడదూ? పంపుతాడు. దేవుడు దయామయుడు. తనకి ఏ పాపం తెలీదు. అందుకే తప్పకుండా పంపుతాడు. రాజ్య లక్ష్మి పెదిమలు గబగబ కదుల్తున్నాయి. కన్నీరు చెక్కిళ్ళ మీంచి జారుతోంది. హోటల్ సర్వర్ ఆమె స్థితి చూసి, జాలిపడి ఇటు అటు తచ్చాడి కాఫీ తెచ్చాడు. రాజ్యలక్ష్మి సంభాళించుకు, కాఫీ తాగేందుకు గదిలోకి వెళ్ళింది.

సాయింత్రం అయింది. రోడ్డుమీద జనం గబగబ నడచిపోతున్నారు. రాజ్యలక్ష్మి డాబా పిట్టగోడ దగ్గిర కుర్చీ వేసుకు కూచుంది. రోడ్డుమీద జనం అందరికీ ఇళ్ళకి జేరు కోవాలనే ఆతృత. వాళ్ళందరికి గమ్యస్థానం వుంది. తనకే ఏదారీ, దిక్కూ లేదు. రోడ్డుమీద ఇందరు వెడుతున్నారు. ఒక్కరన్నా తనకి సాయం చెయ్యకూడదూ? తన్నీ హోటల్

నుంచి, వీర్రాజునుంచి తప్పించి, భర్త దగ్గిరకు జేర్చ గూడదూ ? అలా జేర్చినవాడికి – ఆజన్మాంతం దాసిగా వుంటుంది!

దూరాన ఎవరో హాఫ్‌నూటు అతను వెళుతున్నాడు. అతన్ని చూస్తే ఎదో ఎరుగున్న ముఖంలా వుంది. పరకా యించి చూసింది. వాళ్ళ వదినకు పింతల్లి కొడుకు అచ్చు ఇలాగే వుంటాడు. అతను, తన పెళ్ళికి ముందు వేసంగిలో విశాఖపట్నం వచ్చి, ఓ వారం రోజులున్నాడు. బెజవాడలో ఉద్యోగం చేస్తున్నాడని చెప్పాడు. అతనేమో! అవును, అతను లాగానే వున్నాడు. పిలవనా? పిలిచి తన దుస్థితి చెప్పు కుంటే? ఏమని పిలవను? అతని పేరు సర్వేశ్వర్రావని జ్ఞాపకం. పేరెట్టి పిలవనా? పిలిచి ఏం చెప్పాలి? నా భర్త నన్ను అనుమానించి వెళ్ళగొట్టాడని చెప్పనా?

చెపితే – 'యిక్కడికెల్లా వచ్చావ్?" అని అడగడూ!

అప్పుడు వీర్రాజు పేరు చెప్పాలి. వీర్రాజుతోపాటు పొరుగూర్లో హోటల్లో వున్నానంటే, అతను మటుకు తనని అనుమానించడూ! ఇదంతా వొట్టి భ్రమ. తనకు ఎవరూ లేరు. తను ఏకాకి. ఒక్క వీర్రాజు మటుకే తనకి కొంచెం సాయం చేస్తాడు.

ఏమో అతను మటుకు తిరిగి వస్తాడని నమ్మకం ఏమిటి? రాకపోతే? తన ఖర్మ అని ఎలా వూరుకోడం! హోటల్ అద్దె చెల్లించడం, తను మద్రాసు వెళ్ళడం ఇవన్నీ ఎలా జరుగుతాయి? తనదగ్గిర ఒక్క జత గాజులు, మెళ్లో

పుస్తెలతాడూ తప్ప మరేం లేవే! అవయినా ఎలా అమ్మాలి; ఎక్కడ అమ్మాలి; కాసు ధరెంత! ఈ వివరాలు తనకి తెలియవే! వీర్రాజు రావాలి. తనపాలిట దేవుడు ఆ వీర్రాజు. అతను రావాలి. ముక్కోటి దేవతలకి మొక్కుతోంది వీర్రాజు రాకకై రాజ్యలక్ష్మి.

చీకటి పడింది. రోడ్డుమీద దీపాల తోరణాలు. ఆ తోరణాల మధ్య నడిచే మనుషులు. ఆ మనుషుల మధ్య వీర్రాజుకై రాజ్యలక్ష్మి కళ్ళు ఆతృతగా వెతుకుతున్నాయి. చీకటిపడ్డ సంగతి తెలియడంలేదు రాజ్యలక్ష్మికి. పరిసరాల్ని పూర్తిగా మర్చిపోయి, ఆమె వొకటే ధ్యాసలో వుంది— వీర్రాజు రాకకై.

"ఇక్కడ కూచున్నారా!" అన్న వీర్రాజు మాటలకి వులిక్కిపడి వెనక్కి చూసింది. తను ఎవరికోసం రోడ్డంతా వేయి కన్నులతో వెతుకుతోందో, అతను తన వెనక నిల్చున్నాడు. వీర్రాజు రాకకోసం ఎదురు చూడటంలో, ఆమె ప్రతి నెత్తురు చుక్కా, ప్రతి నిశ్వాస తీక్ష్ణంగా వున్నాయి. అలాటిది అతను వెనక నుల్చోడంతో, రాజ్యలక్ష్మి నవ నాడులూ క్రుంగిపోయాయి. వొక్కసారి వీర్రాజువంక చూసింది. ఆమెకి దుఃఖం పొర్లుకొస్తోంది. నోట్లో చెంగు కుక్కుకు, పరుగెత్తికెళ్ళి పక్కమీద పడిపోయి, వెక్కివెక్కి ఏడుస్తోంది.

వీర్రాజుకి అంతా అయోమయంగా ఉంది. అతను [illegible] గబగబా వచ్చాడు. పరధ్యానంగా గదిలోకి

వెళ్ళాడు. గదిలో లైటులేదు, మనిషి అలికిడి వినిపించలేదు. అతనికి ఈ అమ్మాయి ఏదన్నా అఘాయిత్యం చెయ్యలేదు గదా అని ఒక్కసారి భయింవేసింది. స్విచ్ వేశాడు. లైటు వెలుగు వసారాలో వున్న రాజ్యలక్ష్మిమీద పడింది. అక్కడ కూచున్నట్లు చూసి, నెమ్మదిగావచ్చి పల్కరించాడు.

పలకరించగానే ఒక్కసారి ఉలిక్కిపడి, భయంతో చూసింది. కళ్ళల్లో ఒక్కసారి మెరుపులా సంతోషం కనిపించింది. అంతే, నోట్లో చెంగుకూరుకు ఏడుస్తూ గదిలోకి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

వీర్రాజుకి మనస్తత్వ పరిశీలన ఏమీ తెలీదు. అతను అలాటి శాస్త్రాలు చదువుకోలేదు. ఫిఫ్త్‌ఫారమ్ మూడేళ్ళు పట్టికొట్టి, చదువుకి స్వస్తి చెప్పాడు. కాని, అతనికి ఆడవాళ్ళ అందచందాలూ, వాళ్ళ ముఖకవళికపట్టి ఆంతర్యం తెలుసుకోడం వుగ్గుపాలతో వచ్చిన విద్య. అంతవరకూ లేంది, ఈ అమ్మాయికి, ఈ సాయంత్రం తనని చూడంగానే, ఏదో పెద్ద సంతోషం కలిగింది; అది మటుకు ఖాయం. ఆ సంతోషం తరువాత దుఃఖం ఎందుకు ముంచుకొచ్చిందో తలకాయ బద్దలు కొట్టుకున్నా వీర్రాజుకి అర్థంకాలేదు.

సర్వరునిపిలిచి తను వెళ్ళింతరువాత ఆమె ఏం జేసినదీ ఎవరైనా వచ్చారా ఇత్యాది వివరాలు తెలుసుకున్నాడు. అంతా మామూలుగానే వుంది. అలాంటప్పుడు తనని చూడగానే సంతోషం, వెనువెంట దుఃఖం ఈ రెండూ ఎందుకు కలిగాయో అతనికి బోధపడటంలేదు.

కొందరు స్త్రీలు నడుస్తున్నప్పుడు బావుంటారు. కొందరు స్త్రీలు వాలుచూపుల్లో అప్సరసలను జ్ఞాపకం తెస్తారు. కొందరు కోపంలో అందంగా ఉంటారు. కాని రాజ్యలక్ష్మి అతని కంటికి అందంగా అసలు కనిపించనే లేదు. ఏదో తన వల్ల ఈ అమ్మాయికి అపకారం జరిగింది. అందుకు ప్రత్యామ్నాయంగా సాయంచేసి చేతులు కడుక్కోవాలని చూస్తున్నాడు వీర్రాజు. అంతే. అంతకుమించి ఆమె అందచందాలు గురించి తలంపు లేమీ రాలేదింతదాకా.

కాని, రాత్రి అతనువచ్చి "ఇక్కడ కూచున్నారా?" అని అడిగినప్పుడు ఆమె కళ్ళల్లో సంతోషం బుగ్గలమీదుగా జారి ముఖానికి ఒక గొప్ప అందం ఇచ్చింది. సంతోషంతో వెలిగిన ఆ కళ్ళు, ఆ చెక్కిళ్ళు అతను ఒక్కసారి చూశాడు. ఆ వెలుగుని వీర్రాజు మర్చిపోలేకుండా వున్నాడు.

రాజ్యలక్ష్మి వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆమెను ఎలా ఓదార్చాలో తెలియడంలేదు. తను తెచ్చుకున్న సూట్ కేస్ లోంచి ఇస్త్రీమడతలు తీసుకు స్నానానికి వెళ్ళాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి తనను తాను సంబాళించుకుని, ముఖం తుడుచుకు మంచంమీద కూచుంది.

*　　　*　　　*

వీర్రాజు స్నానంచేసి గదిలోకి వచ్చాడు. రాజ్యలక్ష్మి మంచంమీద కూచుంది. ఆమె ముఖం సర్వ సాధారణంగా

వుంది. కళ్ళు వాచివున్నాయి. ఆమెని చూడగానే గంట క్రితం చూసిన వెలుగు జ్ఞాపకం వచ్చింది వీర్రాజుకి.

క్యారియర్ వచ్చింది; రాజ్యలక్ష్మి వడ్డించింది.

అన్నానికి కూచున్నాక అన్నం తింటూ "డబ్బు తెచ్చాను" అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి మాట్లాడలేదు.

"రేపు వుదయం తొమ్మిదింటికి ఎక్స్‌ప్రెస్. అదెక్కితే సాయంత్రం చీకటిపడ్డాక మద్రాసు వెళ్తాం. రేపు రాత్రి మెయిలు ఎక్కితే, ఎల్లుండి వుదయానికి వెళ్తాం."

"రేపు రాత్రిదాకా ఎందుకు, పొద్దుటే వెళ్దాం" అంది రాజ్యలక్ష్మి.

"మద్రాసు నే నెప్పుడూ వెళ్ళలేదు. అంచేత రాత్రి పూట వెళ్ళి, హోటల్ అదీ వెతుక్కోవడం కష్టం."

"హోటలెందుకు, మహిళా సదనానికి వెళ్దాం."

"అలా, అమాంతం వెళితే చేర్చుకోరట. పగలు, అంటే వుదయం పదింటికి వెళ్ళాలిట. అప్లికేషన్ రాయాలి. దానికంతా చాలా తతంగం ఉంది."

"ముందు హోటల్‌లోనే దిగాలా?"

"హోటల్ గాకపోతే, స్టేషను కెదురుగ్గా సత్రం వుంది. కాని, అది బాగోదుట. అంచేత హోటల్‌కే వెళ్దాం."

రాజ్యలక్ష్మి మాట్లాడలేదు.

"పగలయితే నాకూ అంత కొత్త వుండదు. రాత్రి మెయిలుకి వెళ్దాం" అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి తలవూపింది.

రాజ్యలక్ష్మికి తనవాళ్ళ సంగతి, ఊళ్ళోవాళ్ళు ఏమనుకుంటోందీ అడగాలని వుంది. కాని ఎలా అడగాలో తెలియలేదు. అదీగాక పరాయి మొగాడితో, తన అత్త-మామలూ, భర్తా వారిని గురించి చర్చించడానికి మనసొప్ప లేదు.

రాత్రి పక్క మీద పడుకునే టప్పుడు యింక ఆగలేక—

"మీవాళ్ళు ఏమన్నారు?" అంది రాజ్యలక్ష్మి.

"అంతా విని, మా నాన్న డబ్బిచ్చారు."

"మీ ఆవిడ?"

"అది యిల్లాంటి విషయాల్లో కలిపించుకోదు. మీ అత్తగారు అడిగినవాళ్ళకీ, అడగనివాళ్ళకీ కూడా 'కోడలు లేచిపోయిం'దని చెపుతోంది. మీ ఆయన వాజమ్మలా అంతా వింటూ వూరుకున్నాడు. అసలు అతనెప్పుడూ ఇంతే, వొట్టి పిరికిదద్దమ్మ."

తన మొగుణ్ణి వీర్రాజు ఆ మాట అన్నందుకు రాజ్య లక్ష్మికి వొళ్ళు వుడికిపోతోంది. కాని, ఎలా సమాధానం చెబుతుంది? తన భర్త పిరికివాడా! ఏమో! ఏమయినా వీర్రాజులాగా గోడలు దూకడుగా! సుబ్బులు ఏమందో అడగాలని అనిపించింది, కాని ధైర్యం చాలలేదు. ముఖం నిండా చీరుచెంగు కప్పుకు పడుకుంది రాజ్యలక్ష్మి.

రాజ్యలక్ష్మి తనవాళ్ళ గురించే అడిగి, వాళ్ళ అత్తమామల సంగతి అడగకపోయేసరికి వీర్రాజుకి కొంచెం కోపం వచ్చింది. అసలు తన తండ్రి ఎంత రభస చేస్తాడో, ఎలా అప్పు పుట్టించాలి—యిత్యాది భయాల్తో తను వెళ్ళాడు. తండ్రి కథ అంతా విని, ఆ పిల్లని సదనంలో జేర్చి, త్వరగా యింటికి జేరుకోమని చెప్పేవేళకి తన చెవుల్ని తాను నమ్మలేకపోయాడు. ఇంక ఆ సుబ్బులు తల్లి చేస్తున్న అల్లరి ఇంతా అంతా కాదు. కూతుర్ని కాపాడుకునేందుకు కోడల్ని దుమ్మెత్తి పోస్తోంది. ఆ రమణరావు చవట! పెద్దమ్మారిలా గదిలో కూచుని వెళ్ళిపోయిన పెళ్ళాం గురించి దుఃఖిస్తున్నాడు.

తనవాళ్ళకీ, వీళ్ళకీ ఎంత వ్యత్యాసం! ఆమె అత్తారేదో చాలా మంచిదయినట్టూ, తన తండ్రి పెళ్ళాం దుర్మార్గులయినట్టూ ఈ పిల్ల అనుకుంటోంది. నిజానికి తన కులంవాళ్ళే చాలా నయం! తల్చుకున్నకొద్దీ అతనికి రాజ్యలక్ష్మిమీద కోపం హెచ్చుతోంది.

అందుకని సిగరెట్టు అయిపోయాక, ఆమెను పిల్చి, తలుపు గడియ వేసుకోమని, రెండో ఆట సినిమాకు వెళ్లాడు.

మరునాడు వీర్రాజు బజార్లన్నీ తిరిగి భోజనం వేళకి గదికొచ్చాడు. రాజ్యలక్ష్మి అలా గదిలో కూచుని ఆలోచిస్తూ, కాసేపు తన గతికి విచారిస్తూ, కాసేపు సదనం గురించి కలలుగంటూ పగలంతా గడిపింది.

ఆ రాత్రి ఇద్దరూ మద్రాసుకు వెళ్ళే రైలు ఎక్కారు.

రాజ్యలక్ష్మి ఎప్పుడూ మద్రాసు చూడలేదు. వీర్రాజూ అంతే. ఇద్దరూ మూడోక్లాసు పెట్టెలో తెల్లవార్లూ కూచుని తెల్లవారాక మద్రాసు చేరారు.

ఏడున్నరకి మెయిలు సెంట్రల్ స్టేషన్‌లో ఆగింది. వీర్రాజుకి స్టేషనంతా అయోమయంగా వుంది. కాని, బెజవాడ ప్లాట్‌ఫారమ్ హడావుడికీ, రద్దీకి అలవాటుపడి ఉన్నాడు కాబట్టి, కాస్త ధైర్యంగానే వున్నాడు.

రైలు దిగాక సామాను కూలివాడిచేత మోయించుకు, తన స్నేహితుడు చెప్పిన హోటల్‌కి గుర్రబ్బండి చేసుకు బయులుదేరాడు. రాజ్యలక్ష్మి వచ్చే పోయే కార్లనీ, రిక్షాల్నీ, సిటీబస్సుల్నీ, వెడల్పాటి రోడ్డునీ వీటన్నిటినీ చాలా ఆశ్చర్యంగా చూస్తోంది. ఈ మహా పట్నంలో తాను ఏకాకి. తనకు వీర్రాజు తప్ప మరెవరూ దిక్కులేరు. ఇవే ఆమె ఆలోచనలు. బండి హోటల్ ముందు ఆగింది.

వీర్రాజు లోపలికెళ్ళి గది అడిగాడు. పదిరూపాయల అడ్వాన్సు కట్టి రూమ్ తీసుకున్నాడు.

రాత్రంతా రైలులో నిద్దర లేదు. ఇద్దరూ కూచుని వున్నారు తెల్లవార్లూ. కాఫీ తాగి స్నానం చేశాక రాజ్యలక్ష్మి జంపఖానా పరుచుకు, ఓ పక్కగా కూర్చుంది. వీర్రాజు మంచంమీద కూచున్నాడు. ఇద్దరికీ కళ్ళు కూరుకు పోతున్నాయి. అయినా రాజ్యలక్ష్మికి మహిళా సదనంలోకి అప్పుడే వెళ్ళాలని వుంది. వీర్రాజు వరిగి వరిగి కూచున్నవాడల్లా, మంచంమీద నెమ్మదిగా పడుకున్నాడు ఆవలిస్తూ. అయిదు నిముషాల్లో హాయిగా నిద్దరపోయాడు.

రాజ్యలక్ష్మికి నిద్దర ముంచుకొస్తున్నా ఆపుకుని మహిళాసదనానికి వెళదామనుకుంది. కానీ, తీరా అతను నిద్దరపోయాడు. అలా నిద్దరపోతున్న మనిషిని లేవడానికి సంకోచపడింది. తలుపు గడియ వేసి, జంపఖానా మీదకి తనూ ఒరిగింది.

మెళుకువ వచ్చి కళ్ళు తెరిచే వేళకి వీర్రాజు మొహం కడుక్కుని గదిలోకి వస్తున్నాడు. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. అంటే తొమ్మిది గంటలనుంచీ ఇద్దరూ నిద్దర పోతున్నారన్న మాట.

కారియర్ వచ్చింది. ఇద్దరూ భోంచేశారు. వీర్రాజు సిగరెట్టు కాల్చుకునేందుకు డాబాలోకి వెళ్ళాడు. రాజ్య లక్ష్మి మహిళా సదనానికి వెళ్ళడానికై జంపఖానా వగైరా కట్టుకుంటోంది.

వీర్రాజు లోపలికొచ్చి, ఆమె జంపఖానా కట్టడం చూసి, "సరాసరి పసుపు చుట్టతో వెళ్ళదామనుకుంటు న్నారా?"

"అవును మళ్ళీ రావడం ఎందుకు?"

"మీరు వెళ్ళీ వెళ్ళగానే వెంటనే చేర్చుకోరట. ముందు సెక్రెటరీగారిని కలుసుకుని, ఆ పైన ప్రయాణం అవు దుగాని" అన్నాడు వీర్రాజు.

మూడున్నరకి యిద్దరూ చెరో రిక్షా యెక్కి మహిళా సదనానికి బయలుదేరారు. ఇద్దరికీ చెరో రూపాయిన్నర చొప్పున బేరాలాడాడు. ఆ రిక్షాలవాళ్ళు సందులు మలుపులు

అన్నీ తిరిగారుగాని మహిళా సదనం మాత్రం కనుక్కో లేక పోయారు. తీరా ఇద్దరు ముగ్గురు నడిగి, అక్కడికి, జేరుకునే వేళికి ఆరున్నర అయింది. అంచేత లోపలికి ఎవ్వరినీ రానియ్యలేదు. గేటు చూసి వెనక్కి వచ్చేశారు ఇద్దరూ.

ఇద్దరూ హోటల్‌కి వచ్చారు. రాజ్యలక్ష్మికి వీర్రాజు మీద చాలా కోపంగా ఉంది. అతను నిద్దరపోవడంవల్ల, ఈ సాయంత్రం తను సదనంలో జేరేందుకు వీలులేకపోయింది. అదే ఏ పదింటికో బయలుదేరి వుంటే, నాలుగయ్యేవేళకి సదనంలో జేరివుండేది. ఇంక ఈ రాత్రికి, ఈ గదిలో గడపాల్సిన అవసరం లేదనుకుంది. కాని వీర్రాజు నిద్రవల్లే ఇంత పని జరిగింది. రాజ్యలక్ష్మికి దుఃఖం, కోపం అన్నీ ముంచుకొచ్చాయి.

వీర్రాజుకి ఇవేం అర్థం అవడంలేదు. ఈ అమ్మాయికి కావలసిన మరో నాలుగు చీరెలూ వస్త్రాలు కొని ఈ అమ్మాయిని సదనంలో జేర్చి, మద్రాసంతా చూసి యింటికి చేరుకుందామని అనుకుంటున్నాడు. అసలు బెజవాడ నుంచి బయలుదేరుతున్నప్పుడు, తాను ఒక్కరోజులో సేవాసదనం కనుక్కో కలుగుతానని అనుకోలేదు. ఆ ఒక్క పూటలోనే సదనం కనుక్కోడంతో, అతనికేదో పెద్ద విజయం సంపాదించినట్లయింది.

వీర్రాజు స్నానంజేసి వచ్చాడు. రాజ్యలక్ష్మి ఉసూరుమంటూ, అలాగే జంపఖానామీద కూచుండి పోయింది. అతనికి సన్నగా యీాలపాట పాడాలని అనిపించి, తల దువ్వ

ఉంటూ యిలాల వేశాడు. కాని, గబుక్కున రాజ్యలక్ష్మి ముఖంచూసి ఆగిపోయాడు.

అన్నం వచ్చింది. రాజ్యలక్ష్మి సరిగా భోంచెయ్యలేదు. వీరరాజు రెండు మూడుసార్లు చెప్పి, మాట్లాడక ఊరుకున్నాడు.

ఎనిమిదయింది. కొత్త ఊరు, కొత్త ప్రదేశం. అతనికి ఓ అరవసినిమా చూడాలని ఉంది. కాని, ఎలా వెళ్ళాలో దారి తెలియదు. అందుకు ఊరుకున్నాడు. పోనీ, ఈ అమ్మాయి మాట్లాడుతుందేమో అంటే అదీ లేదు. వీరరాజు పక్కమీద దొర్లుతున్నాడు. అతనికి రమాయమ్మా, పిల్లలూ జ్ఞాపకానికి వస్తున్నారు. అతను కదులుతున్న కొద్దీ, రాజ్యలక్ష్మికి ఏదో తెలియని భీతి ఎక్కువవుతోంది. ఊపిరి బిగపట్టి ముఖంమీద చెంగు కప్పుకు, కదలక మెదలక పడుకుంది.

తెల్లవారగట్ల లారీ చప్పుడుతో రాజ్యలక్ష్మికి మెలుకువ వచ్చింది. ఒక్కసారి ఉలిక్కిపడి లేచి చుట్టూ చూసి, కిటికీలోంచి బయటకు చూసింది. రోడ్డుమీద లారీలు వెళ్తున్నాయి. మళ్ళీ జంపఖానామీదికి వచ్చి పడుకుంది. నిద్దర పట్టడంలేదు, తెల్లవారితే గబగబా పనిముగించుకు సదనంలోకి వెళ్ళి చేరవచ్చు. అక్కడితో తన జీవితం ఒకదరిన పడుతుంది.

తెలతెలవారుతోంది. వీరరాజు ఇటు అటుకదిలి కళ్ళు తెరిచి రాజ్యలక్ష్మివైపు చూసి, మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. ఇంకో అయిదు నిముషాలకి లేచాడు. ఇద్దరూ ముఖాలు కడుక్కుని, ఇడ్లీ - సాంబారు, కాఫీ పూర్తిచేశారు.

స్నానంచేసి, ఎనిమిది అయేవేళకి క్రిందటి రోజు మాదిరే రిక్షాలమీద బయలుదేరారు. రిక్షావాళ్లు ఆ క్రిందటి రోజునవచ్చినవాళ్ళే కాబట్టి, ఈసారి ఒక ముప్పావు గంటలో సదనందగ్గిరకు చేర్చారు.

ఇద్దరూ సదనం ఆవరణలోకి అడుగు పెట్టారు, ఇద్దరికీ బెరుకు బెరుకుగా ఉంది. వీర్రాజుకి చదువుకున్న వారితో, ఉద్యోగస్థులతో అట్టే పరిచయం లేదు. అక్కడ సదనంలో ఎంతమంది వుంటారో, తెలుగు మాట్లాడుతారో లేదో, తన ఇంగ్లీషుకి నవ్వుతారేమో ఇలాటి సందేహాలు అతన్ని అడుగడుక్కీ పీడిస్తున్నాయి.

రాజ్యలక్ష్మికి తనని ఏమాదిరి ప్రశ్నలువేస్తారో, తనకీ వీర్రాజుకీ ఎలాటి సంబంధం ఉందని అనుకుంటారో అని భయంగా ఉంది.

ఏమైతేనేం, యిద్దరూ ఆఫీసుగదిదగ్గిరకొచ్చారు. అక్కడున్న గుమస్తా తెలుగులోమాట్లాడటంతో; వీర్రాజుకి ప్రాణం వచ్చింది. వివరాలు గుమస్తాతో చెప్పాడు.

"సెక్రటరీగారికి వంట్లో బాగా లేదు. సెలవుమీద ఉన్నారు. ఇంకా మూడు రోజులు పోయాకరండి" అన్నాడు గుమాస్తా.

రాజ్యలక్ష్మికి నెత్తిన పిడుగు పడ్డట్టయింది.

"అంతవరకూ ఈ అమ్మాయిని యిక్కడఉంచుకోండి" అన్నాడు వీర్రాజు.

"అబ్బే, అలాంటిది సంభవం కాదు. ఆమె వస్తేగాని

ఈ అమ్మాయిని చేర్చుకునేదీ లేందీ తెలియదు. అంతవరకూ ఇక్కడ ఉంచుకోడానికి వీలులేదు." అన్నాడు గుమస్తా నిక్కచ్చిగా.

రాజ్యలక్ష్మికి కాళ్ళల్లోంచి వణు కొచ్చినట్టయింది. ఒళ్లు తిరిగినట్టయి పడిపోకుండా ఉండేందుకు తలుపు రెక్క పట్టు కుంది. అయిదు నిముషాలయినా వాళ్లు వెళ్ళకపోవడంచూసి, రాసుకుంటున్న గుమస్తా తల పైకెత్తి "మూడు రోజులు పోయాక రండి, ఇప్పుడేం లాభంలేదు" అన్నాడు.

ఇద్దరూ ఉసూరుమంటూ బయటకొచ్చారు. ఇద్దరికీ తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఏదో ఈ పూటతో పని ఐపోతుంది, రేపటినుంచి మద్రాసు విశేషాలు చూద్దామను కుంటున్నాడు వీర్రాజు. అతను ఎంత మంచివాడైనా, తను సదనంలో జేరితేగాని, తనకి విముక్తి లేదనుకుంటోంది రాజ్య లక్ష్మి. పాతరిక్షావాళ్ళిద్దరూ గేటు దగ్గిరే కనిపెట్టుకున్నారు, మళ్ళీ ఆ రిక్షాలమీదనే ఎక్కి హోటల్‌కి జేరారు.

రాజ్యలక్ష్మికి కన్నీళ్ళు వస్తున్నాయి. ఎంత ప్రయ త్నించినా ఏదో దుఃఖం భయం ఆగడంలేదు. వీర్రాజు పని అంతంత మాత్రంగానే ఉంది. బెజవాడ అయితే తనకు దార్లూ వగయిరా తెలుసు కాబట్టి, ఈ అమ్మాయిని హోటల్లో వదిలి తిరిగి వచ్చాడు. ఈ మహాపట్నంలో. ఈ అమ్మాయిని ఒక్కదాన్ని హోటల్లోవుంచి తను రోడ్డమ్మట తిరగటం అంత మంచిదికాదు. అందుకని ఈ గదిలో ఈ అమ్మాయిని కనిపెట్టుకుని, ఇరవైనాలుగు గంటలూ కూచోటం తనవల్లగాదు.

భోజనం అయాక, రిక్షావాళ్లు చెప్పారు — ఇక్కడికి జూ చాలా దగ్గిరట. చూసివద్దాం పదండి" అన్నాడు వీర్రాజు.

"మీరు వెళ్ళండి," అంది రాజ్యలక్ష్మి.

"పట్నంలో ఒంటరిగా హోటల్ రూమ్‌లో వుండటం మంచిదికాదు. ఇద్దరం వెళదాం. మూడు రోజులదాకా మీరు, నేను చేసేదేమీ లేదు." అన్నాడు వీర్రాజు.

రాజ్యలక్ష్మి జూకి బయులుదేరింది. వీర్రాజుకి జూలోని జంతువులు, మైలేడి గార్డెన్సు ఇవన్నీ చాలా బావు న్నాయి. రాజ్యలక్ష్మికి ఏమీ చూడాలని లేదు. కాని, అతని వెంట వెళుతోంది. ఒక్క పంచరంగుల చిలకల్ని, కోతుల్ని చూస్తున్నప్పుడు తప్ప, రాజ్యలక్ష్మి తన ప్రస్తుత స్థితిని మర్చిపోలేకపోయింది.

ఏడింటికి ఇద్దరూ అలిసి హోటల్‌కొచ్చి పడ్డారు. మరునాడు మ్యూజియమ్‌కి తీసుకెళ్ళడానికి వప్పుకు, మరీ వెళ్ళారు రిక్షావాళ్లు.

రాజ్యలక్ష్మికి దారీ తెన్నూ తెలియడంలేదు. సదనం సెక్రటరీకి త్వరగా వాళ్లు నయం గావాలని వెయ్యిసార్లు కోరుకుంది. ఆమె గనుక తనని దయతలచి సదనంలో జేర్చుకుందా; తన జీవితానికి ఓ దారి అంటూ ఏర్పడుతుంది. వీర్రాజుకయితే, ఆరాత్రి సినిమా చూడాలని ఉంది. కాని, ఆమెని అడిగే సాహసంగానీ ఒంటిగా వెళ్ళే తెగింపుగానీ

లేకపోయింది. అందుకే భోంచేశాక - పక్కమీద పడుకుని బలవంతాన నిద్దర తెప్పించుకున్నాడు.

o o o o

మరునాడు వుదయం ఎనిమిది అయ్యే వేళకి హోటల్ గుమ్మంముందు క్రిందటి రోజు వచ్చిన రిక్షావాళ్ళలో మొదటి వాడు డబుల్ రిక్షాతో సిద్ధంగా వున్నాడు. రెండో రిక్షావాడికి మరో చోటుకి కిరాయి వచ్చిందట!

అమ్మకీ, అయ్యకీ సరిపోయేందుకు డబుల్ రిక్షా తెచ్చాడు. పై పెచ్చు మొత్తంమీద ఓ రూపాయి తక్కువ ఇమ్మంటున్నాడు.

చచ్చినా ఆ రిక్షాలో ఎక్కకూడదనుకుంది రాజ్యలక్ష్మి. కాని ఆ రిక్షావాడి మాటలు, మరో రిక్షా దొరక్కపోవడం దాంతో వీర్రాజు పక్కన కూచోక తప్పిందికాదు. ఎంత వదిగి వదిగి కూచున్నా అతని పక్కన కూచోటం వెగటుగా వుంది. కాని, వీర్రాజు ఇవేమీ గమనించడంలేదు. అతను మద్రాసు రోడ్ల అందాన్ని రెండు కళ్ళతో తాగేస్తున్నాడు.

వీర్రాజుకి "జూ" నచ్చినంతగా "మ్యూజియమ్" నచ్చలేదు. చేపల అస్థిపంజరాలు తప్ప. మిగతావేమీ అతన్ని ఆకర్షించలేదు. అనుకున్న వేళకంటె ముందుగానే హోటల్‌కి జేరుకున్నారు.

ఇక ఆ రోజు రూము విడిచి కదలకూడదనుకుంది

రాజ్యలక్ష్మి. మూడున్నరకి కాఫీ తాగాక వీర్రాజు చైనా బజారుకి ప్రయాణం చేశాడు.

"మీరు వెళ్ళండి. నే గదిలో పడుకుంటా. నాకు తల నొప్పిగా వుంది." అంది రాజ్యలక్ష్మి.

"ఎల్లుండి మీరు సదస్సులో జేరేవేళకి యింకో నాలుగు చీరెలూ అవీ కావాలా? మీకు కావలసిన వస్తువులు ఈ సాయంత్రం కొనుక్కుంటే, రేపు ఎక్కడికీ వెళ్లక్కర్లేదు," అన్నాడు వీర్రాజు.

చైనాబజారు చూసేవేళకి, రాజ్యలక్ష్మికి మతి పోయింది. అంతజనం, అన్నిషాపులు, ఆ రిబ్బన్ల కుప్పలు, రాజ్యలక్ష్మి ఎప్పుడూ చూడలేదు. చైనా బజారులో తిరిగి వేలాది జన సందోహంలో కలిసిపోయింది రాజ్యలక్ష్మి.

నాలుగు చీరెలు, జాకెట్టు గుడ్డలు, లంగాలకి తెల్ల బట్టా, చెప్పులూ యిలా ఓ అరవై రూపాయలదాకా ఖర్చు చేశాడు వీర్రాజు. రాజ్యలక్ష్మికి అతన్ని చూస్తే జాలేసింది. తను వద్దంటున్నా వినక అతను చెప్పులుకూడా కొన్నాడు. తను పుట్టాక యింతవరకూ కాళ్ళకి చెప్పులు వేసుకోలేదు. పాపం! అతను చేతనైనంత సాయం జేస్తూనే వున్నాడు. తనే దురదృష్టవంతురాలు.

బజారులో సామాన్లు కొనడం అయ్యాక టైము చూసుకుంటే ఆరు అయింది. వీర్రాజు రిక్షాలని 'ప్రభాత్'కి పొమ్మన్నాడు. రిక్షావాళ్ళు సినిమాహాలు దగ్గిర రిక్షా ఆపే

దాకా తాము సినిమాకి వస్తున్నామనే సంగతే తెలియదు రాజ్యలక్ష్మికి.

దాంతో వీర్రాజుమీద కలిగిన జాలి మటుమాయమై పోయింది. భర్త వదిలేసిన తనను, సదనంలో జేరేందుకు మద్రాసు వస్తే సూటిగా సదనంలో జేర్చక సినిమాలు సరదాలూనా? ఏదో తప్పుపని చేస్తున్నట్టనిపించింది.

"మీరు వెళ్ళండి. నేను యీ రిక్షామీద గదికి వెళ్ళి పోతా" అంది రాజ్యలక్ష్మి.

"అలా వల్లకాదు. మీరూ పదండి" అన్నాడు వీర్రాజు, ముందు నడుస్తూ. గత్యంతరం లేక అతని వెనక నడిచి హాల్లోకి వెళ్ళింది.

హాలంతా చాలా అందంగా, పెద్దగా ఉంది. సినిమాలు చాలా అరుదుగా చూసిన రాజ్యలక్ష్మి తెరమీద బొమ్మ చూడటంతోటే వీర్రాజునీ, మహిళా సదనాన్నీ, తన జీవితాన్నీ అన్నీ మరిచిపోయింది.

◆ ◆ ◆

రాత్రి తొమ్మిదిన్నరకి హాలులోంచి బయటకొచ్చారు. వీర్రాజు చాలా హుషారుగా వున్నాడు. సినిమాలో డాన్సులు, పాటలు అతని బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. రాజ్యలక్ష్మి బుర్రలోగూడా చిత్రంతాలూకు మనుషులు దోబూచులాడుతున్నారు.

భోంచేశారు. రాజ్యలక్ష్మి జంపఖానామీద పడు

కుంది. వీర్రాజు మంచంమీద పడుకున్నాడు. అతనికి సినిమాలో డాన్సులు పూరికే జ్ఞాపకానికి వస్తున్నాయి. రాజ్యలక్ష్మికి నాయకి కష్టాలు జ్ఞాపకం వస్తున్నాయి. నాయకికూడా భర్తనుండి వేరుచెయ్యబడింది; ఆఖరికి భార్యా భర్తలిద్దరూ కలుసుకున్నారు. ఆఖరు సీను ఎంత బావుంది! వాళ్ళిద్దరూ కలుసుకొని ఒకరినొకరు తనివితీరా చూసుకున్న సీను రాజ్యలక్ష్మిని కలచివేస్తోంది.

ఒక్కసారి తన జీవితం, తన భర్త ప్రేమ, తన కష్టాలు జ్ఞాపకంవచ్చి, దుఃఖం వెల్లువలా వచ్చేసింది. వెక్కి వెక్కి ఏడుపు వస్తోంది. నోట్లో చెంగు కుక్కుకున్నా శబ్దం ఆగటం లేదు.

సినిమాలోని డాన్సులని తిరిగి తిరిగి వూహించుకుంటున్న వీర్రాజు ఆమె ఏడుపు విని కంగారుబడి మంచందిగి, దగ్గరకొచ్చాడు. రాజ్యలక్ష్మి బుజాలు గాలిలో ఆకుల మాదిరి వూగిపోతున్నాయి.

అప్రయత్నంగా ఆమె బుజాలమీద చేతులు వేసి పట్టుకుని, వోదారుస్తున్నాడు వీర్రాజు. రాజ్యలక్ష్మి ఏడుపు ఆగటం లేదు. అల్లల్లాడే ఆమె బుజాల్ని పట్టుకు బుజ్జగిస్తున్నాడతను.

వీర్రాజు చేతులకింద రాజ్యలక్ష్మి బుజాలు బొద్దుగా మెత్తగా వున్నాయి. ఆమె వళ్ళు నునువెచ్చగా, అతని వేళ్ళకి తాకింది. ఏడుస్తున్న ఆమె ముఖాన్ని తనవేపుకి తిప్పుకున్నాడు. రాజ్యలక్ష్మి బుసలుకొట్టే తాచులా ఒక్కసారి

విదిలించుకు, దూరానికి జరిగింది; పాములవాడు బుసలుకొట్టే పామయితే మాత్రం పట్టకుండా వదుల్తాడా!

అంతవరకూ ఏ తలపూ లేకుండా నిర్వికారంగా వోదారుస్తున్న వీర్రాజు, ఆమె ఒక్కసారి విదిలించుకోడంతో, అతనికి తెలియకుండా అంతరాంతరంలో మాటుమణిగి వున్న కోర్కెలు ఒక్కసారి విజృంభించి పురివిప్పి నాట్యమాడాయి.

అంతే! రాజ్యలక్ష్మి పోరాటం, శోకం ఏమీ ఆమెని రక్షించలేకపోయాయి. పోరాడి పోరాడి నిస్సహాయంగా, తనకున్న ఆఖరి అమూల్యాన్నికూడా పోగొట్టుకుంది, నిర్భాగ్యురాలు రాజ్యలక్ష్మి.

వీర్రాజు తానెప్పుడూ అటువంటి పనిచేస్తానని అనుకోలేదు. అసలు తన మూలానే ఆమె కాపరం నీళ్ళపాలయింది. ఇప్పటి తన ప్రవర్తన ఆమెను పూర్తిగా అధోలోకానికి తోసింది. తనెందుకలా ప్రవర్తించాడు? అతను తన జీవితాన్ని, ప్రవర్తనని ఎన్నిసార్లో తిట్టుకున్నాడు. రాజ్యలక్ష్మి కాళ్లుపట్టుకు ఒక్కసారి ఏడవాలనిపించింది వీర్రాజుకి. జంపఖానామీద చైతన్యరహితంగా, కుప్పమాదిరి కూలివున్న రాజ్యలక్ష్మిని చూస్తే అతనికి భయం వేసింది.

ఆ గదిలోని నిశ్శబ్దం అతనికి భరించరానిదిగా వుంది. కనీసం ఆ అమ్మాయి ఏడుస్తేనా బాగుండును. అలా రాయిలా వుండిపోడం అతనికి కంగారుగా వుంది.

పక్కమీద కూచున్నాడు. అతనికి ఏమీ తోచటం లేదు. జంపఖానావైపు చూశాడు. రాజ్యలక్ష్మి చాప

చుట్టలా పడివుంది. అడుగులో అడుగేసుకుంటూ దగ్గరకెళ్ళి కూచున్నాడు. రాజ్యలక్ష్మి కదల్లేదు. గోడవేపు తిరిగి, కట్టెలా పడుకుంది.

వీర్రాజు ఆమె వంక రెప్ప వాల్చకుండా చూశాడు. అతనికి అతనిమీదే జుగుప్స, కోపం, జాలీ అన్నీ ఒకేసారి కలిగాయి.

రాజ్యలక్ష్మి రెండు కాళ్లూ పట్టుకుని వెక్కి-వెక్కి ఏడుస్తున్నాడు. మొగవాళ్లు ఏడవడం రాజ్యలక్ష్మి ఎప్పుడూ చూడలేదు, ఆమెకి తన పరిస్థితిగానీ, వీర్రాజు పరిస్థితిగాని ఆలోచించే ఓపిక లేదు. అసలు మెదడు మొద్దువారిపోయింది. అతని చేతులు, తన కాళ్ళమీద పడేసరికి, భయంతో కాళ్ళు లాక్కుంది. వీర్రాజు ముందుకు జరిగి ఆమె పాదాలు గట్టిగా పట్టుకున్నాడు. రాజ్యలక్ష్మి తప్పించుకు దూరంగా జరిగి కూచుంది.

o o o o

వీర్రాజు మంచంమీద పడుకుని వున్నాడు. శరీరం అంతా దిమ్మెక్కి-నట్లుంది. తను చేసిన పని తల్చుకుంటే అతనికి చచ్చిపోవాలనిపించింది. మరి తనుచచ్చిపోతే ఆ అమ్మాయి గతేంకాను? ఆ అమ్మాయిని ఎలాగైనా సదనంలో జేర్చి, ఈ వూరువదిలి వెళ్ళిపోవాలి.

తనకే చచ్చిపోవాలని అనిపిస్తోందే మరి, ఆ అమ్మాయికి మటుకు అలా అనిపించదూ? ఈ ఆలోచన వచ్చే

వేళకి, మత్తుగా వున్న అతని మెదడు దెబ్బతిన్నట్లు ఒక్క సారి మేలుకుంది.

రాజ్యలక్ష్మి వేపు తిరిగాడు. మోకాళ్ళమీద తల ఆనించి కూచుని వుంది. ఈ రాత్రంతా ఇలా జాగరణ చేస్తుందా? ఒకవేళ తను నిద్దరపోతే ఏమీ అఘాయిత్యం చెయ్యడుగదా? అనుకుంటూ నిద్దరపోతున్నట్టనిపించినా, కను కొలకుల్లోంచి రాజ్యలక్ష్మిని చూస్తున్నాడు.

రాజ్యలక్ష్మికి ఒక్కటే ఒక తరుణోపాయం కని పిస్తోంది. ఈ బాధలనుంచి, అవమానాలనుంచి తను తప్పించు కోవాలి. అందుకు ఒక్కటే ఒక్క మార్గం. అంటే చచ్చి పోవాలి. ఎలా చచ్చిపోడం? నుయ్యి లేదుకదా దూక డానికి,కనీసం తాడుకూడా లేదే? మేడమీంచి దూకుతేనో, ఈ ఆలోచన తట్టేవేళకి పెద్ద బరువు దించినట్లయింది. ఆమెకి చావంటే భయం లేదు. ఇటువంటి జీవితం కంటె మృత్యువు చాలా నయం.

రాజ్యలక్ష్మి తలెత్తి వీర్రాజువంక చూసింది. అతను నిద్దరపోతున్నాడు. మెల్లగా తలుపుతీసి, డాబా పిట్టగోడ పట్టుకు నిల్చుంది. కిందికి చూసింది. డాబా బాగా ఎత్తుగానే ఉంది. కింద పడగానే హాయిగా ఈ లోకంనుంచి వెళ్ళి పోవచ్చు. కిందికి చూసింది. ఎందుకో తన భర్త జ్ఞాపకం వచ్చాడు. అతను తన చావువిని విచారిస్తాడా? ఏమో? కిందికి చూసి కాలు కదుపుతోంది. వెనకనుంచి వీర్రాజు చేతులు ఇనుపచేతుల్లా బుజాల్ని గట్టిగా పట్టుకున్నాయి.

రాజ్యలక్ష్మి గదిలోకి వచ్చింది. వీర్రాజు డాబావేపు తలుపుకు తాళం వేశాడు.

మెళుకువ వచ్చి కళ్లు తెరచే వేళకి గదిలో సూర్య కిరణాలు తీక్షణంగా పడుతున్నాయి. రాజ్యలక్ష్మికి రాత్రి జరిగిన అవమానం జ్ఞాపకం వచ్చింది. గట్టిగా కళ్లు మూసుకుంది. మూలుగు వినపడటంతో కళ్లు తెరిచి చూసింది. వీర్రాజు మూలుగుతున్నాడు.

లేచి పక్కన నిల్చుని చూసింది. అతను తన వంక కన్నెత్తి చూడలేదు. ఏదో బాధపడుతున్నట్టు మూలుగుతున్నాడు. వొంటిమీద చెయ్యివేసి చూసింది. వళ్ళు పేలిపోతోంది. రాజ్యలక్ష్మి మంచందగ్గిర కూలబడిపోయింది. పదినిముషాలు అలా కూచుండిపోయింది.

తను ఏం చెయ్యాలి? ఇతనికి ఏం జ్వరం? అతన్ని ఎలా మాట్లాడించడం! రాజ్యలక్ష్మికి ఆలోచించేశక్తి నశించినట్లయింది.

"ఇటు చూడండి" అంది వీర్రాజుని సంబోధిస్తూ.

అతనికి వినపడినట్లు లేదు. నుదుటిమీద చెయ్యివేసి, ముఖం తన వేపుకు తిప్పుకుంది. అతని కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. రాజ్యలక్ష్మికి ఏమి అడగాలో తెలియలేదు. "జ్వరం వచ్చిందా?" అంది.

"ఊఁ" అని వత్తిగిలి పడుకున్నాడు.

తలుపుతీసి ముఖం కడుక్కుని కాఫీ తాగింది. వీర్రాజు

లేచి కాఫీ తాగలేకపోయాడు. హోటల్ బాయ్, మేనేజరుకి వెళ్ళి చెప్పాడు వీర్రాజుకి జ్వరంగా వుందని.

మేనేజర్ వచ్చి పరిస్థితి అంతా చూశాడు. మహా పట్నంలో—పాపం! ఆడది ఎలా నెట్టుకొస్తుందో అని జాలి పడ్డాడు.

ఒక గంటలో డాక్టరువచ్చి చూశాడు. ఏదో యింజక్షను యిచ్చి, జ్వరం జారకపోతే సాయంత్రం మందు మారుస్తానని చెప్పి వెళ్ళాడు.

రాజ్యలక్ష్మికి భయంగా వుంది. వీర్రాజు మూలుగుతున్నాడు. మధ్య మధ్య నిద్దరపోతున్నాడు. అంతే. మంచి నీటి చుక్క—గూడా తాగటంలేదు. వళ్ళు పేలిపోతోంది. ఈ జ్వరం ఎప్పటికి తగ్గుతుందో, తను ఏమవుతుందో అర్థమవడం లేదు రాజ్యలక్ష్మికి.

సాయంత్రం డాక్టరు వచ్చేవేళకి నూటమూడు జ్వరం వుంది. వీర్రాజు వూరికే మూలుగుతున్నాడు. డాక్టరు గ్లూకోజ్ నీళ్ళు యిమ్మని, తలమీద మంచు పెట్టమని సలహా యిచ్చి, మరునాడు వస్తానని చెప్పి వెళ్ళాడు.

రాత్రి చాలాసేపు తలమీద అయిసు పెడుతూ కూచుంది రాజ్యలక్ష్మి. అతనికి అయిసువల్ల గుణం కనిపించినట్టు లేదు. ఒంటిగంటకి కాస్త కన్నుమూశాడు వీర్రాజు.

మరునాడు ఉదయం డాక్టరు మంచీ చెడ్డా అంతా కనుక్కుని, జ్వరం కొంచెం యిబ్బంది పెట్టేట్టుందని తేల్చాడు. "హాస్పిటల్‌లో చేరుస్తే మంచిది. మీ పెద్దవాళ్ళని రప్పిం

చండి, మీ రొక్కరే చూసుకోలేరేమో!" అన్నాడు డాక్టరు.

రాజ్యలక్ష్మి ఏం సమాధానం చెబుతుంది!

"ఎప్పుడు జేరుస్తానంటారు?" అని అడిగింది రాజ్యలక్ష్మి.

"ఇప్పుడే అంబులెన్స్‌కి ఫోన్ చేస్తే వస్తుంది."

"మరి నేనుగూడా వెంట వుండవచ్చా?"

"గవర్నమెంటు హాస్పటల్ అయితే మీరు రాత్రిళ్లు వుండగూడదు. నర్సింగ్‌హోమ్ ఐతే ఎప్పుడూ దగ్గిరే వుండ వచ్చు."

"అయితే నర్సింగ్‌హోమ్‌లోనే జేర్చండి."

"చాలా డబ్బవుతుంది."

"ఫరవాలేదు," అంది రాజ్యలక్ష్మి.

హోటల్ ఖాళీచేసి, వీర్రాజుతోపాటు నర్సింగ్‌హోమ్‌కి వచ్చింది రాజ్యలక్ష్మి. మూడు రోజులయింది. జ్వరం హెచ్చుతోందేగాని తగ్గడంలేదు. వీర్రాజు ముఖంలోని కళంతా మాయమయిపోయింది. కళ్ళు పీక్కుపోయినాయి. ఉదయంవేళ కొంచెం బాగానే వుంటున్నాడు. కాస్త మాటా మంచీఆడుతున్నాడుగాని, సాయంత్రంపూట బొత్తిగా అన్యాయంగా వుంది. సాయంత్రంతోపాటు టెంపరేచర్ రైజ్ అవుతోంది. మూలుగు ఎక్కువవుతోంది. రాత్రి పన్నెండింటిదాకా అలా జ్వరంతో మూలిగి కన్నుమూస్తున్నాడు వీర్రాజు.

డాక్టరు మందు ఇస్తున్నాడు. అయిసు పెడుతున్నారు. జ్వరం అర డిగ్రీకూడా తగ్గడంలేదు. నాలుగో రోజున డాక్టరు అన్నాడు:

"చూడండీ మీరు చిన్నవారు, ఎందుకయినా మంచిది, మీ పెద్దవారికి వైర్ ఇవ్వండి." అని. రాజ్యలక్ష్మి గుండెల్లో రాయిపడ్డది.

ఎవరికి వైర్ ఇస్తుంది? ఏమని ఇస్తుంది? అతని తండ్రి పేరుగూడా తనకి తెలియదాయెను.

మరునాడు ప్రుదయం ముఖం కడిగి, గ్లూకోజ్ ఇచ్చాక, "మీ నాన్నగారికి ఉత్తరం రాస్తాను," అంది రాజ్యలక్ష్మి.

"వద్దు."

"ఏం?"

"మీ సంగతి?"

"ఫరవాలేదు. అడ్రసు చెప్పండి" అంది రాజ్యలక్ష్మి.

వీర్రాజు తండ్రి అడ్రసు చెప్పాడు.

ఆ సాయంత్రం డాక్టరు చేతికి అడ్రసు కాయితం ఇచ్చి, వైర్ యిప్పించింది.

తాను తొందర పడుతున్నానేమో అనుకుందిగాని, రాత్రి వీర్రాజు పిచ్చి మాటలు, టెంపరేచర్ నూటనాలుగు రావడం—చూస్తే, తను చేసినపని సబబుగానే తోచింది. ఆ రాత్రి వీర్రాజు తండ్రిపేరు, పిల్లలపేర్లు చాలాసార్లు పలవరించాడు. రాజ్యలక్ష్మికి ఎటూపాలుబోవడంలేదు, రేపు తండ్రి

వచ్చి ఏమంటాడో? డాక్టరు ఖర్చులకు పోను తన చేతిలో ఇంకో వంద మిగిలాయి, అంతే. కోపంవచ్చి రాకపోతే తమ పని ఏంగాను? ఇతనికి ఎప్పటికి తగ్గుతుంది? తను సదనంలో జేరడంకూడా కలలాగానే నిల్చిపోతుందా?

ఆ మరునాడు వీర్రాజుకి పూర్తిగా తెలివితప్పింది. ఒకే పిచ్చి మాటలు. పెళ్ళాన్ని చెడతిట్టాడు. ఏడిచాడు. నర్సింగ్ హోమ్‌లోని నర్సు పక్కన వుందిగాని, లేకపోతే రాజ్యలక్ష్మి ఏమైపోయేదో? పౌనులకొద్దీ ఐసు తలమీద పెడుతున్నారు. జ్వరంమటుకు అలానే వుంది. పగలూ రాత్రీ రాజ్యలక్ష్మి అలా పక్కదగ్గిర కూచునే వుంది.

ఆరోజు ఉదయం వీర్రాజు తండ్రీ, రమాయమ్మా, పిల్లలూ వచ్చే వేళకి వీర్రాజుకి వంటి మీద స్పృహలేదు. ఊరికే గొణుగుతున్నాడు. తలకాయ ఆపకుండా తిప్పుతున్నాడు.

రమాయమ్మ భోరుభోరున ఏడ్చింది. రాజ్యలక్ష్మిని తిట్టితిట్టి ఏడుస్తోంది. రమాయమ్మ రాకతో రాజ్యలక్ష్మి - వీర్రాజుల 'సంబంధం' అందరికీ తెలిసింది. అంతవరకూ వాళ్లు రాజ్యలక్ష్మి వీర్రాజుకి భార్య అనుకుంటున్నారు. వాళ్ళ హేళన చూపులకి, రమాయమ్మ తిట్లకి, వీర్రాజు తండ్రి తన వంక ఏహ్యంగా చూసే చూపులకి వీటికి దేనికి రాజ్యలక్ష్మి బాధపడలేదు. అసలు, మాటలూ చేష్టలూ గురించి బాధపడే రోజులు పోయాయి, ముందు వీర్రాజు బతికి బయటపడాలి.

తండ్రివచ్చిన రోజంతా వీరరాజుకి వంటిమీద స్పృహ లేనేలేదు. మరునాడు తెల్లారగట్ల అయిదింటికి కొంచెం తెలివివచ్చి కళ్ళు తెరిచాడు. రాజ్యలక్ష్మి రమాయమ్మనీ, తండ్రినీ పక్క దగ్గరకు రమ్మని సైగ చేసింది.

వాళ్ళని చూసేవేళకి వీరరాజుకి కళ్ళంట నీరు కారింది. పిల్లల్ని, భార్యనీ ఒక్కసారి చూశాడు. తండ్రిని దగ్గరకు రమ్మని సైగచేసి, రాజ్యలక్ష్మిని చూపించి, "అన్యాయం చేశాను, సదనంలో జేర్పించండి" అని హీనస్వరంతో అన్నాడు. తండ్రి తల వూపాడు. రమాయమ్మ వెక్కి వెక్కి ఏడుస్తోంది. రాజ్యలక్ష్మి తలవంచుకు స్టూలుమీదకూచుంది. వీరరాజు ఆ మెవంక ఒక్కసారి చూశాడు. పడుకున్న పిల్లలవంక చూశాడు.

మళ్ళీ తెలివితప్పింది. మూలుగు ఆరంభం అయింది. డాక్టర్లకికూడా అతని పరిస్థితి కంగారుగా వుంది. జ్వరం తగ్గటం లేదు. ఆయాసం. కాళ్ళు వూరికే కొట్టు కుంటున్నాడు.

రమాయమ్మ అన్ని దేవతలకి మొక్కుతోంది. తండ్రి కళ్ళంట నీళ్ళు పెట్టుకుంటూ గోడకానుకు కూచున్నాడు. రాజ్యలక్ష్మికి ఇవేమీ కనిపించడ లేదు. మందులు, టెంపరేచర్, ఐస్ ఇవ్వే. ఇంకే ఆలోచనలూ ఆమెకి రావడంలేదు.

సాయంత్రం అయినకొద్దీ వీరరాజుకి ఆయాసం ఎక్కు వవుతోంది. డాక్టర్లు కంగారుపడుతున్నారు. ఆ రాత్రి గనక గడిస్తే ఫరవాలేదంటున్నారు. ఆ రాత్రి గడుస్తుందా? ఏమో!

కాళ్లూ తలా ఆగకుండా కొట్టుకుంటున్నాడు. సన్నగా నూతిలో మాదిరి మూలుగుతున్నాడు. గాలి పీల్చడంకూడా కష్టం అవుతోంది.

రమాయమ్మ ముక్కోటి దేవతలకు మొక్కి ఏడుస్తోంది. డాక్టర్ల కాళ్ళుబట్టుకు ఏడుస్తోంది. డాక్టర్లు చేతనయినంత వరకూ చేస్తూనే వున్నారు. నిముషాలు యుగాల్లా కదుల్తున్నాయి. రాజ్యలక్ష్మి పక్క స్టూలుమీద కూచుని, మిషన్ మాదిరి తలకు ఐసు పెడుతోంది.

రమాయమ్మతో యింతవరకూ ఒక్క మాట మాట్లాడలేదు. బొమ్మలా తన పని తాను చేసుకుపోతోంది. ఏడ్చి ఏడ్చి సొమ్మసిలి పడివుంది రమాయమ్మ. మంచానికి ఒక పక్క తండ్రి, మరోపక్క రాజ్యలక్ష్మి కూచుని వీర్రాజు జీవన్మరణ పోరాటాన్ని చూస్తున్నారు.

ఒంటిగంట రెండు, మూడు, నాలుగు దాటింది. వీర్రాజు ఆయాసం కాస్త తగ్గింది. మూడు రోజులనించీ లేంది, కనురెప్పలు మూతలుపడ్డాయి. డాక్టరు గండం గడిచింది అన్నాడు.

రాజ్యలక్ష్మికి వళ్ళంతా తూలిపోతోంది. రూమ్‌లో ఒకమూల గోడకానుకు కూచుని కళ్ళు మూసింది. కళ్ళు తెరిచేవేళకి ఎనిమిది అయింది. అప్పుడే డాక్టరు లోపలికొచ్చి టెంపరేచర్ చూశాడు. ఒక డిగ్రీ తగ్గింది. ఇంక ఫరవాలేదు రెండు మూడు రోజుల్లో దారిన పడతాడని చెప్పాడు.

ఈ మాటలు రాజ్యలక్ష్మి చెవుల్లోకి కలలో మాదిరి

కళ్ళలు, కమలాయమ్మ కళ్ళనీరు తుడుచుకుంటూ మంగళ సూత్రం కళ్ళకద్దుకుంటోంది.

ఆ పగలల్లా వీర్రాజు మూల్గుతూనే వున్నాడు. సాయంత్రం పిచ్చిమాటలు మాట్లాడలేదు. డాక్టరు యీ గుణాన్ని చూసి ఇంక వీర్రాజుకి భయంలేదని చెప్పారు. సాయంత్రం అయింది. దీపాలు పెట్టారు. వీర్రాజు బతికాడు. ఇక తన జవాబుదారీ లేదు. రాజ్యలక్ష్మి మెట్లన్నీ ఎక్కి, బిల్డింగ్ టెర్రేస్ డాబామీదికి వచ్చింది. సాయంత్రం గాలులు చల్లగా ఆమె శరీరాన్ని తాకుతున్నాయి.

వీర్రాజు బతికాడు. కాని, తన జీవితం మాటేమిటి? తను సదనంలో చేరటం పడుతుందా? ఇన్ని అవమానాలు అయ్యాక, తిరిగి సదనంలో జేరి చేసేదేముంది? మూడంతస్తుల మేడమీదించి, ఒక్కసారి చూసింది. చీమలబారుల్లా రోడ్డుమీద మనుషులు కనిపిస్తున్నారు.

వీర్రాజుకి నయమయితే, భార్యా పిల్లల్తో సుఖంగా వుంటాడు. తను గనుక ఎదురుగా వుంటే, మళ్ళీ తన జీవితాన్ని గురించి బాధపడుతూంటాడు. తనకి జీవితంలో ఏ ఆలంబనా లేదు. తాను ఎవరికీ అక్కర్లేదు! భర్త, అత్త మామలు తనని దగాచేశారు. అందరిలోకి వీర్రాజు కొంచెం మెరుగే కాని, తను లేకపోతేగాని అతనికి సుఖం వుండదు.

ఒక్కసారి కిందకి చూసింది. కాలు పిట్టగోడమీద పెట్టింది, దగాపడ్డ సోదరికి ప్రాణాలమీద తీపి అంటూ

వుంటేగదా? వచ్చేందుకు ఏ ఆలోచనలూ లేక మనసు ఒక విధంగా నిశ్చలమైంది. వెనకటికి మళ్లే ఆపేందుకు వీరరాజు పక్కన లేడు.

రాజ్యలక్ష్మి మరోసారి కిందకు చూసింది. కళ్ళు గట్టిగా మూసుకుని, రెండో కాలు గూడా పిట్టగోడమీద పెట్టింది, 'శ్రీహరీ' అని గొణుక్కుంటూ అంత ఎత్తునుంచి కిందకి దూకి, అవమానాలూ, అన్యాయాలూ, లేని చోటికి వెళ్ళిపోయింది.

మరి రెండు రోజులయాక వీరరాజుకి కొంచెం బాగా తెలివివచ్చింది. కళ్ళు తెరిచి గదంతా ఒక్కసారి కలయ చూశాడు. తండ్రీ, భార్యా పిల్లలు కనిపించారు.

తండ్రీ, భార్యా ఆనందంతో మంచందగ్గర కొచ్చారు. తండ్రిని దగ్గిరకు వంగమని సైగచేసి "ఆ అమ్మాయి ఏది?" అని అడిగాడు వీరరాజు.

"సదనంలో జేర్చాను," అన్నాడు తండ్రి.

వీరరాజు సంతృప్తిగా నిట్టూర్చి, కళ్ళుమూసుకు నిద్దర పోయాడు.

—: స మా ప్తం :—